తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పేజీలు: 8 వెల: 3 సంపుటి:3 సంచిక: 236
ఆదివారం 01, ఫిబ్రవరి 2026
॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## కరీంనగర్ మేయర్ సీటు మాదే
### కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా



కరీంనగర్,జనవరి31(అక్షరగళం):కరీంనగర్ మేయర్‌తో పాటు మూడు చైర్మన్ పీఠాలు తమవేనని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం,కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంచార్జ్‌లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు సమావేశంలో బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం. గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం. గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లుటిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తప్పుడు ప్రచారాలు నమ్మకండి. డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగింది. శనివారం డివిజన్ల వారీగా వచ్చిన నామినేషన్లను వేరు చేసి ఒక్కొక్కటిగా రిటర్నింగ్, సహాయ అధికారులు పరిశీలించారు. మొత్తం 1,257 నామినేషన్లు వచ్చాయి. దీనికి 736 మంది దరఖాస్తు చేశారు.

# నేడు పార్లమెంట్ ముందుకు
# కేంద్ర బడ్జెట్



- ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం
- ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్
- ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు

న్యూఢిల్లీ,జనవరి31(అక్షరగళం): కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చున్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ఉంటుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశలు నిజం చేసే దిశగానే కేంద్రం బ్జడెట్ ఉండనుందని సమాచారం. పన్నుల విషయంలో కీలక మార్పులు జరగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026లో ఆదాయపు పన్ను నిబంధనలో పలు మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, సీనియర్ సిటిజన్లకు లాభం చేకూరేలా ఈ మార్పులను కేంద్రం తీసుకువస్తుందని సమాచారం. పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, పన్ను విషయంలో భారాన్ని తగ్గించడం, పారదర్శకత, డిజిటల్ పన్ను వ్యవస్థను ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడమే లక్ష్యంగా బడ్జెట్ ఉండనుందన్న వార్తలు వస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను చట్టం 1961 నుంచి.. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 వరకు సరళమైన పరివర్తనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సత్వర పన్ను వాపసులు, సరళీకృత సమ్మతి కీలక లక్ష్యాలుగా ఉండనున్నాయని సమాచారం. వార్షిక సమాచార ప్రకటన, పన్ను చెల్లింపుదారుల సమాచార సారాంశం వంటి వ్యవస్థలు పన్ను దాఖలును సులభతరం చేశాయి. డిజిటల్ వ్యవస్థను మరింత నమ్మదగినదిగా, పారదర్శకంగా మార్చడంపై బడ్జెట్ 2026 దృష్టి సారించే అవకాశముంది. ఏఐని సరిగ్గా ఉపయోగించినట్లయితే పన్ను రిటర్న్‌లను ఆటోమేటిక్‌గా దాఖలు చేయొచ్చని, లోపాలను తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను వాపసుల కోసం రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సాయపడనుంది. ఆదాయపు పన్ను కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రాధాన్యం, క్రిప్టో, డిజిటల్ ఆస్తులపై స్పష్టమైన నియమాలకు ఉపయోగ పడుతుంది. మరోవైపు.. కొత్త పన్ను విధానం వచ్చినప్పటికీ కొన్ని అంశాల్లో పాత పన్ను విధానం అందుబాటులో ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గృహ రుణాలు, బీమా ప్రీమియంలు, పదవీ విరమణ పొదుపులు, ఇతర పెట్టుబడులకు సంబంధించిన పన్ను తగ్గింపులకు సంబంధించి పాత విధానాలే ఉంటాయని తెలుస్తోంది. బాగా పన్ను రాయితీ కలిగిన వారు పాత పన్ను విధానం నుంచి ప్రయోజనం పొందడం కొనసాగించవచ్చు. అయితే తక్కువ పన్ను మినహాయింపులు ఉన్న వ్యక్తులు కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సరైన విధానాన్ని ఎంచుకోవడం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అవుతుంది. విద్యా, గృహ ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలను నిర్వహించే కుటుంబాలకు ఈ మార్పులు ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని అందించవచ్చు. 2026లో ఆదాయపు పన్ను నియమాల మార్పు నుంచి సీనియర్ సిటిజన్లు కూడా ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా పెన్షన్ ఆదాయం, వాటి వడ్డీ ఆదాయాలపై సరళీకృత పన్ను విధించడం ద్వారా పన్ను దాఖలును సులభతరం చేస్తాయి. ఏది ఏమైనప్పటికీ.. ట్యాక్స్ ప్లేయర్లకు కేంద్రం శుభవార్త చెప్పనుందని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన పన్ను విధానం పెద్దగా ప్రయోజనకారిగా లేదన్న విమర్శలు వచ్చాయి.

## బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి



- గతంలో లాగా కాకుండా కేటాయింపులు పెరగాలి
- అన్యయాం జరిగితే బిజెపి ఎంపిలదే బాధ్యత
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,జనవరి31(అక్షరగళం): కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. దానిని సరిదిద్ది కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..?, చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



## మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

- శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక
- కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె
- అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

ముంబై,జనవరి31(అక్షరగళం): నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మిగతా.. 2లో

## జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌కు ఆమోదం

- రూ.11,460 కోట్ల బడ్జెట్ ప్రకటన
- ఫిబ్రవరి 10తో ముగియనున్న పదవీకాలం

హైదరాబాద్,జనవరి31(అక్షరగళం): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం




తెలిపింది. గ్రేటర్ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వివిధ పార్టీల మిగతా.. 2లో



## ముగిసిన జనజాతర

- గద్దెలు వీడిన అమ్మవార్లు
- చిలకలగుట్ట చేరిన సమ్మక్క
- జయజయధ్వానాలతో వీడ్కోలు
- ఇళ్లకు పయనమైన భక్త జనం

మేడారం,జనవరి31 (అక్షరగళం): మేడారం గద్దెపై కొలువై.. మూడు రోజులుగా పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల నడుమ పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారిని సాగనంపే క్రతువులో గిరిజన సంప్రదాయ సంగీత వాయిద్యాల చప్పుళ్లు.. కొమ్ముబూర శబ్దాలకు భక్తులు నృత్యాలు చేస్తుండగా.. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా.. 2లో

## సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

- నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు
- అయినా మీకు విచారించే అధికారం లేదు
- ఎర్రవెల్లిలో అందుబాటులో ఉంటానని చెప్పాను
- నేరుగా నోటీసులు ఇవ్వకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు
- ఏసిపికి తనను విచారించే అధికారమే లేదు
- జూబ్లీహిల్స్ ఏసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ
- నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి




హైదరాబాద్,జనవరి31(అక్షరగళం): జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై మిగతా.. 2లో

## బడ్జెట్ ఆమోదంలో కాంగ్రెస్ విఫలం

- మరోమారు అమెరికాకు తప్పని షట్‌డౌన్

వాషింగ్టన్,జనవరి31(అక్షరగళం): అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమో




దానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచి పోనున్నట్లు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను మిగతా.. 2లో

## గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

- స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ
- రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి
- కాంగ్రెస్ నేతలకు సూచించిన సిఎం రేవంత్

హైదరాబాద్,జనవరి31(అక్షరగళం): మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను



కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మిగతా.. 2లో

## కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు..?

- పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం
- తెలంగాణ తెచ్చిన పెద్దాయననే అవమానిస్తారా
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్‌ఎస్ నేత కెటిఆర్..?

హైదరాబాద్,జనవరి31(అక్షరగళం):మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా మిగతా.. 2లో





## గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

- పుష్కరఘాట్లు, రహదారుల విస్తరణపై దృష్టి
- రాష్ట్రంలో రోడ్ల నిర్వహ: మరమ్మత్తులకు పెద్దపీట
- విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష

2లో



## అమెరికాతో ఒప్పందంపై తొందరలేదు

- ఇయూతో ఒప్పందంతో దేశానికి మేలు
- అమలయ్యే తేదీని త్వరలో ప్రకటిస్తాం
- వాణిజ్య మంత్రి పియూష్ గోయల్

2లో

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

- పుష్కరఘాట్లు, రహదారుల విస్తరణపై దృష్టి
- త్వరితగతిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- దేవాలయాల్లో వసతులపై దృష్టి పెట్టి ముందుకు సాగాలి
- రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ: మరమ్మత్తులకు పెద్దపీట
- 2036 ఒలింపిక్స్ నాటికి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలి
- విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష



హైదరాబాద్,జనవరి31(అక్షరగళం): వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావరి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలెట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్ డిపార్ట్మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధివిధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసుల శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదే శాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు. రవాణా, రోడ్లు భవనాలు శాఖ సమావేశంలో రాష్ట్ర రహదారుల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతి, నాణ్యత ప్రమాణాలు, ప్రజలకు అందిస్తున్న సేవల సామర్థ్యం తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి సమగ్రంగా సమీక్షించారు. రహదారుల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో చేపట్టిన పలు ప్రభుత్వ ఆసుపత్రులు వరంగల్, ఎల్.బి.నగర్, అల్వాల్, సనత్ నగర్, న్యూ ఉస్మానియా, హైకోర్టు నూతన భవనం, భవన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని, వాహనాల నమోదు, డ్రైవింగ్ లైసెన్సులు, రహదారి భద్రత చర్యల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, సెర్ప్, మిషన్ భగీరథ శాఖల పనితీరు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, గ్రామ పంచాయతీల పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు పురోగతి, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మహిళా సంఘాల బ్యాంక్ లింకేజీ, తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. పథకాల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పారదర్శకతను పాటించాలని అన్నారు. గ్రామాల్లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ముఖ్యకార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ కుమార్ సుల్తానియా, ఎన్. శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శృతి ఓఝా, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హన్మంతు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్. హరీష్, డైరెక్టర్ స్పోర్ట్స్ సోనిబాలా దేవి, డైరెక్టర్ కల్చర్ నరసింహారెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ లు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన జనజాతర

(మొదటి పేజీ తరువాయి)

మిగతా గద్దెలపై కొలువై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతంలోని గుళ్లకు తీసుకెళ్లారు. సమ్మక్కను బయటకు తీసుకొచ్చిన సందర్భంలో భక్తులంతా 'సమ్మక్క తల్లికి జై.. అందరినీ సల్లంగ చూడమ్మ'.. అని వేడుకుంటూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. పూజారుల బృందానికి చుట్టూ మూడంచెల భద్రతతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సహా పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మొత్తంగా మేడారం మహా జాతర ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు . నాలుగు రోజుల్లో రెండు కోట్ల మంది పైచిలుకు భక్తులు మేడారం జాతరకు తరలి వచ్చారు. మహా జాతర వేళ భక్తులు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. తల్లుల వనప్రవేశంతో వన జాతర పూర్తయ్యింది. సాయంత్రం సమయంలో గద్దెలను పరిశుభ్రం చేసి, గిరిజన పూజారులు అమ్మవార్లకు సంప్రదాయ పూజలను నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ దేవతల వనప్రవేశం కార్యక్రమం ఆరంభమయ్యింది.

ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాఘట్టం జనవరి 28 నుంచి 31వరకు జరుగగా.. శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలను ఆచరించి వన దేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. సమ్మక్క సారలమ్మలకు చీర, ఒడిబియ్యం, సారె పోసి దేవతలను మనసారా కొలుచుకున్నారు. సమ్మక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యలు పూజల అనంతరం వనప్రవేశం చేయిస్తారు. సమ్మక్కతల్లి చిలుకల గుట్టకు వెళ్లనుండగా సారలమ్మ కన్నెపల్లికి చేరుకోనున్నారు. అదేవిధంగా ఏటూరునాగారం మండలం కొండాయికి గోవిందరాజు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల కు పగిడిద్దరాజును తిరిగి చేర్చనున్నారు. ఈ తంతుతో మహాజాతర ముగిసింది. అమ్మవార్ల దర్శనం అనంతరం మళ్లీ వస్తాం తల్లీ అంటూ భక్తులు ఇండ్లకు పయనమయ్యారు. జాతరలో చివరిరోజు మేడారంలోని వనదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ అమ్మవార్లకి మొక్కులను సమర్పించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు వారికి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. హైకోర్టు జడ్జిలు సృజన, రాణి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో భక్తులు నానా అవస్థలు పడ్డారు. దర్శనం సాఫీగా జరిగినా, రిటర్న్ జర్నీ ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని వాపోయారు. గంటల కొద్దీ బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అక్రమ పద్ధతిలో జారీ చేసిన నోటీసులను విస్మరించే హక్కు తనకు ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తనకు సంబంధించిన నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. అలాగే ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావించారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే..

'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65 ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 అసఖఅ నిబంధనలను మీ దృష్టికి తెచ్చాను' అని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశిరచిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు.

'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.

# బడ్జెట్ ఆమోదంలో కాంగ్రెస్ విఫలం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ లోకి వెళ్లిపోయింది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను ఆమోదించడానికి అర్ధరాత్రి వరకూ గడువు ఉన్నా.. ఆ లోపు దాన్ని కాంగ్రెస్ ఆమోదించలేకపోయింది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువును కాంగ్రెస్ దాటవేయడంతో ప్రభుత్వం శనివారం పాక్షికంగా షట్ డౌన్ అయింది. దీంతో పలు సేవలు నిలిచిపోబోతున్నాయి. షట్‌డౌన్ స్వల్పకాలికంగా ఉండవచ్చని సెనేటర్లు చెబుతున్నారు. మరోవైపు గడువుకు ముందు బడ్జెట్ పై ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో, తాత్కాలిక లేదా పూర్తి-సంవత్సర నిధుల చర్యను కాంగ్రెస్ ఆమోదించే వరకు కీలకం కాని పలు ప్రభుత్వ కార్యకలాపాల్ని నిలిపేస్తున్నారు. సభ తిరిగి సమావేశం అయ్యాక సెనేట్ మద్దతు ఉన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి తగినంత మద్దతును కూడగట్టడానికి చట్టసభ సభ్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ?. అమెరికాలో దాదాపు మూడో వంతు ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, రక్షణను నిర్వహించే అనేక ఏజెన్సీలలో షట్‌డౌన్ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విభాగాలు రాత్రికి రాత్రే షట్‌డౌన్ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించాలని భావించాయి. కానీ ఇది తాత్కాలికమేనన్న అంచనాలతో ఆ ప్రతిపాదన విరమించుకున్నాయి. వచ్చే వారం ప్రారంభంలో కాంగ్రెస్ ఊహించిన విధంగా ప్యాకేజీని ఆమోదిస్తే, కొన్ని రోజుల్లో నిధుల పునరుద్ధరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. షట్‌డౌన్ కొనసాగితే మాత్రం పదివేల మంది ప్రభుత్వ కార్మికులు జీతం లేని సెలవును ఎదుర్కోవలసి రావచ్చు, లేదా నిధులు అందేవరకు జీతం లేకుండా పని చేయాల్సి రావచ్చు.

# అమెరికాతో ఒప్పందంపై తొందరలేదు

**ఇయూతో ఒప్పందంతో దేశానికి మేలు**

**అమలయ్యే తేదీని త్వరలో ప్రకటిస్తాం**

**వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ వెల్లడి**

న్యూఢిల్లీ,జనవరి31(అక్షరగళం): ఇటీవల భారత్ యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరిణామం తర్వాత అమెరికాతో కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్ కుదుర్చుకుంటుందా? అనే ప్రశ్నకు భారత వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ లేదని జవాబిచ్చారు. ఆయన ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. రష్యాతో చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా 50 శాతం పన్నుల్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా బెదిరింపులకు లొంగి.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి భారత్ లొంగిపోయిందనే వార్తలొచ్చాయి. అయితే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ముగింపు దిశగా సాగుతుందని పీయుష్ గోయల్ తాజాగా అన్నారు. ఇయుతో భారత్ కుదుర్చుకున్నది మంచి ఒప్పందం. ఈ ఒప్పందం విషయంలో మేము చాలా చురుగ్గా పాల్గొన్నాము. ఈ ఒప్పందం విషయంలో ఇరుపక్షాలు సంతృప్తి చెందాయి. ఈ ఒప్పందం ఎప్పుడు అమల్లోకి వస్తుందో తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన ఈ ఇంటర్వ్యూలో చెప్పారు.

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం చేసుకుంటుందా? అని ప్రశ్నించగా.. అమెరికాతో ఒప్పందం విషయంలో కానీ.. ఆ దేశంతో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు కానీ ఏమీ లేవని నేనకుటున్నాను. కానీ ప్రస్తుతం మేము అమెరికాతో ఒప్పందం చేసుకోకూడదని అనుకుంటున్నాము. ఆ దేశంతో ఒప్పందం ముగించాలనే ఆలోచిస్తున్నాము అని గోయల్ అన్నారు.్గ ÷నడా ప్రధాని మార్క్ కార్నీ ఈ ఏడాది మార్చిలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కెనడాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని గోయల్ తెలిపారు.



# మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు.విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగం ప్రకారం శాసన సభ లేదా శాసన మండలికి ఎన్నిక కాని వ్యక్తి కూడా మంత్రి పదవి చేపట్టవచ్చు. అయితే ఆ వ్యక్తి ఆరు నెలల్లోగా శాసనసభ సభలేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వాలి. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేటర్ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేసీఆర్ హయాంలో జీహెచ్‌ఎంసీ అప్పుల పాలైందని, అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన చేశారు. అయితే మేయర్ గద్వాల విజయలక్ష్మి నచ్చచెప్పడంతో ఇరు పార్టీల కార్పొరేటర్లు సర్దుమణిగారు. అనంతరం 2026-27 బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. బడ్జెట్ పద్దుల్లో జీహెచ్‌ఎంసీకి వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయం : రూ.6,441కోట్లుగా చూపారు. ఇందులో జీహెచ్‌ఎంసీ ఖర్చు : రూ.4,057కోట్లు, రెవెన్యూ మిగులు : రూ.2,384 కోట్లు, జీహెచ్‌ఎంసీ రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లుగా చూపారు. కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం కేటాయింపులు: రూ.2,260 కోట్లుగా చూపారు. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ : రూ.1,860 కోట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. 'ఇది మా చివరి సమావేశం. భావోద్వేగంతో కూడుకున్నది. ప్రతి నిర్ణయం వెనుక మీ బాధ్యత కనిపించింది. ఉద్యోగులు, సిబ్బంది సమర్థంగా పని చేశారు. నగర అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిది. అంతా కలిసికట్టుగా పని చేశారు. ప్రజలకు మెరుగైన సేవల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు లభించాయి. పదవి ముగిసినా నా బాధ్యత మరువను. నగరం మరింతగా అభివృద్ధి చెందేందుకు నా వంతు కృషి చేస్తాను' అని విజయలక్ష్మి వెల్లడించారు.

# గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు.ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని రేవంత్ రెడ్డి టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్‌ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల పక్రియ శుక్రవారంతో ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు..?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగిస్తోంది.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం



# తెలంగాణ రౌండప్

## మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ అభినవ్ రెడ్డి నియామకం



**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జ్‌గా మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారెడ్డి అభినవ్ రెడ్డిని నియమించారు. శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అభినవ్ రెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. పార్టీని విజయపథంలో నడిపిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి పార్టీ విజయంలో భాగస్వాముల వ్వాలని పిలుపునిచ్చారు.



## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):** విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని రిషి టాలెంట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు.

ఈ వేడుకలకు అండేకార్ యాదిలాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదని యాదిలాల్ విద్యార్థులకు సూచించారు. సూచించారు.

అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్లు సత్య రాములు, రమేష్ కరస్పాండెంట్ అవ్వారి నిరంజన్, ప్రిన్సిపల్ పూర్ణ చంద్ర, వైస్ ప్రిన్సిపల్ లలిత మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

**- పాపిశెట్టి రాము**

**ఆమనగల్లు జనవరి 31 (అక్షర గళం):** సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని, అప్పుడే ప్రతి మనిషికి భగవంతుడి ఆశీస్సులు ఉంటాయని ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రాము అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని సాయిరాం ఆప్టికల్స్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా పాపిశెట్టి శ్వేత రాము, కళ్యాణి అరవింద్ దంపతులు గణపతి హోమం, శివ స్వాములకు బిక్ష కార్యక్రమం చేపట్టారు. ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి మనశ్శాంతి కలిగిసమస్యలు దూరమవుతాయన్నారు. భక్తి భావంతో పూజలు, యజ్ఞాలు చేయడం వల్లనే ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో చిత్తరంజన్ దాస్, శ్రీను నాయక్, లక్ష్మీపతి, భుజంగం, యాదయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.



## క్రీడలతోనే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం


**- తహసీల్దార్ ఫహీం**

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):** గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలు కీలకపాత్ర పోషిస్తాయని ఆమనగల్లు తహసిల్దార్ ఫహీం ఖాద్రి అన్నారు. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన వివేక విద్యా భారతి పాఠశాల, మేడిగడ్డ తండా విద్యార్థులకు ఎంఈవో పాండు తో కలిసి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరిన అనేక మంది క్రీడాకారులు సీఎం కప్ వంటి పోటీల ద్వారానే వెలుగులోకి వచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్, ప్రిన్సిపల్ మహమూద్ తదితరులు ఉన్నారు.

## ప్రజా యుద్ధ నౌక గద్దర్ 78వ జయంతి వేడుకలు

**వెల్దండ, జనవరి 31(అక్షర గళం):** వెల్దండ మండల కేంద్రంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం వెల్దండ గద్దర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో 78వ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా యుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన పీడిత ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని పేర్కొన్నారు ఈ పోరాటాన్ని ఉద్యమాన్ని ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు కార్యక్రమంలో కానుగుల జంగయ్య బొజ్జయ్య బాలయ్య బిక్షపతి శేఖర్ పుల్లయ్య గజిని శీను శివకుమార్ ఈదులపల్లి శ్రీనివాసులు జంగిల్ కొండల్ తదితరులు పాల్గొన్నారు.





## అన్నా జర నా ముఖం సూడే..

- **ప్రత్యర్థులు ఎవరో తేలడంతో ఉపసంహారణలకు బేరసారాలు**
- **అభ్యర్థిత్వం ఖరారు చేయని పార్టీలు**
- **ఉప సంహారణలకు 3వ తేదీ వరకు అవకాశం**

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):** మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల పర్వం ముగియడంతో తమ వార్డుల్లో తమకు ప్రత్యర్థులుగా నిలుస్తున్న వారి జాబితా బహిర్గతమైంది. దీంతో శుక్రవారం రాత్రి నుంచే ప్రధాన పార్టీల టికెట్లు ఆశిస్తున్న అభ్యర్థులు తమ ప్రత్యర్థులను బుజ్జగించుకొని నామినేషన్ ఉప సంహరణకు చర్చలు, సిట్టింగ్లు మొదలుపెట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరఫున పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేస్తూ ముందుగా 'బీ' ఫారాలు ఇవ్వకపోవడంతో అభ్యర్థుల మధ్య బేరసారాలు ప్రారంభమయ్యాయి.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఉప సంహరణలకు ఫిబ్రవరి 3వ తేదీ చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల పేరున నామినేషన్లు సమర్పించిన వారు తమకు పోటీగా నామినేషన్ వేసిన వారిని బుజ్జగించుకునే పనిలో పడ్డారు. ఫిబ్రవరి 3వ తేదీ లోపు ఆయా పార్టీల ప్రతినిధులు తమ పార్టీల అభ్యర్థుల పేరున 'బీ' ఫారాలను మున్సిపల్ ఎన్నికల అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే ఆయా పార్టీలు 'బీ' ఫారాలు ఇచ్చిన వ్యక్తులకే ఆ పార్టీల గుర్తులను కేటాయిస్తారు. మిగతా వారు స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీలో నిలవాల్సి ఉంటుంది. అయితే చివరి నిమిషంలో అధిష్టానం నిర్ణయంలో మార్పు జరగవచ్చని కొందరు ఆశవహులు సైతం పార్టీ అభ్యర్థులుగా పేర్కొంటూ నామినేషన్లు సమర్పించారు. పార్టీ తనకు 'బీ' ఫారం ఇస్తుందన్న నమ్మకం ఉన్న అభ్యర్థులు సైతం తనకు ప్రత్యర్థులుగా నిలిచే అభ్యర్థులు పోటీలో నిలిస్తే ఓట్లు చీలే అవకాశం ఉంటుందనే భయంతో వారిని పోటీ నుంచి తప్పుకోవాలని బతిమిలాడుకుంటున్నారు.

శనివారం నిర్వహించే స్క్రూటినీలో పలువురి నామినేషన్లు తిరస్కరించే అవకాశం ఉంది. ప్రతీ అభ్యర్థి నాలుగు సెట్లు వేయడానికి అవకాశం ఉండటంతో నామినేషన్ పత్రాల సంఖ్య అధికంగా ఉంది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, జనసేన ఇతర పార్టీలను ప్రస్తావిస్తూ నామినేషన్లు సమర్పించారు. మరి కొందరు అభ్యర్థులు స్వతంత్ర్య అభ్యర్థిగా, ఇతర పార్టీల పేర్లు సూచిస్తూ నామినేషన్లు వేశారు. ఒక్కో వార్డులో ముగ్గురి నుంచి నలుగురు అభ్యర్థులు ప్రధాన పార్టీల అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. అధికార పార్టీలో ఆశవహుల సంఖ్య అధికంగా ఉండటంతో పార్టీ నాయకత్వం బుజ్జగింపులను ప్రారంభించింది. స్క్రూటినీ ప్రక్రియ పూర్తయి ఉప సంహారణలు, బీ ఫారాల సమర్పన అనంతరం పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర్యులు ఎవరో స్పష్టత వస్తుంది. ఈ లోగా తమ వార్డుల్లో తమకు ప్రత్యర్థులు అనుకున్న వారిని పోటీ నుంచి ఉపసంహరింపజేయడానికి మందు పార్టీలతో మంతనాలు చేస్తున్నారు..





## సమష్టి కృషితోనే గెలుపు సాధ్యం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):** సమష్టి కృషితోనే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల పరిధిలోని రాంనుంతల సమీపంలోని డీఎంకె ఫంక్షన్ హాల్లో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంధ్య రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విభేదాలు వీడి కాంగ్రెస్ గెలుపు కోసం అంకితభావంతో పని చేయాలని కోరారు. 15 వార్డులు అధికార పార్టీ కైవసం చేసుకునేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటే అమనగల్లు రూపురేఖలు మారుస్తానని, అభివృద్ధిలో రాష్ట్రానికే దిక్సూచిగా, ఆదర్శంగా నిలబెట్టే బాధ్యత తనదేనని తెలిపారు. ప్రతీ వార్డులో తాను స్వయంగా ప్రచారం చేస్తానని వెల్లడించారు.

ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, దూకుడుగా ముందుకు సాగాలని అభ్యర్థులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరిస్తూనే అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధిని వివరించాలని తెలిపారు. అంతిమంగా ఆమనగల్లు మున్సిపల్ ను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, బిచ్యా నాయక్, డోకూరు ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్, సంపత్, అంజయ్య గుప్తా, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, సర్పంచ్లు మండ్లి రాములు, మహేందర్ గౌడ్, కర్ణాకర్ గౌడ్, జవహర్ లాల్, మాజీ వైస్ అనంతరెడ్డి, లక్ష్మి కాంత్ రెడ్డి, క్యామా రాజేష్, షాబొద్దీన్, వస్పూల శ్రీకాంత్, తల్లోజు రామకృష్ణ, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, ఖాదర్ ఖాద్రి, కాలే మల్లయ్య, సురేష్ నాయక్, బాబా, ప్రసాద్, దశరథం, చేగూరి వెంకటేష్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఇమ్రాన్ బాబా, సురేష్ నాయక్, నాజర్ తదితరులు ఉన్నారు.

## మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):** ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేయాలని, పనుల ఎంపికలో పంచాయతీల హక్కులను పునరుద్ధరించాలని కోరుతూ కడ్తాల్ మండలం చరికొండ గ్రామసభ శనివారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మాన పత్రాన్ని సర్పంచ్ మహేందర్ గౌడ్.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 సంవత్సరాలు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసిందని, దీని ద్వారా లక్షలాది మంది పేదలు ఉపాధి పొందారని వివరించారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక క్రమంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలు తీసుకుందని, ఇప్పుడు చట్టంలోని గాంధీ పేరును తొలగించి.. దాని స్థానంలో వీబీజీఆర్ఏఎం(జీ) పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు.

తక్షణమే కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని రద్దుచేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికలలో మొండి చేయి చూపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సంధ్యా రెడ్డి, సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా మరియు పలువురు నాయకులు పాల్గొని పంచాయతీల రాజ్యాంగ హక్కులకు తమ మద్దతు ప్రకటించారు.





## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):**
తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామానికి చెందిన. రాజమోని ఈదమ్మ శుక్రవారం రోజున సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం మృతురాలి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తన వంతు సహాయంగా 3000 ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తుమ్మల రామస్వామి, వార్డు సభ్యులు జ్యోతి లక్ష్మయ్య, రాజమోని శంకర్, బక్కి వేణు, రాజమోని శ్రీను, తుమ్మల శ్రీను, తుమ్మల రాజు,లక్ష్మయ్య, బిక్షపతి, నర్సింహా, తుమ్మల కృష్ణ, వెంకటయ్య, సాయిలు, రాజమోని శ్రీశైలం పాల్గొన్నారు.

## బీజేపీతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం

**ఆమనగల్లు, జనవరి 31 (అక్షర గళం):**
బీజేపీతోనే నర్సంపేట పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ 15వ వార్డు అభ్యర్థి కండె సీత రాములమ్మ తెలిపారు. శనివారం ఆ వార్డులోని శివాలయం, ఉదయ నగర్, ప్రతిభ నగర్ కాలనీలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రచారం నిర్వహించారు. మున్సి పాల్టీల్లో అభివృద్ధి పనులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. బీజేపీని గెలిపిస్తే మున్సిపాల్టీ పరిధిలో మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కండె భాస్కర్, జెనిగేలా గిరి యాదవ్, వడ్డే రాజు, వెంకట్, కండె సుమన్, నాగిళ్ల లక్ష్మణ్, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా సందీప్ రెడ్డి

**వెల్దండ, జనవరి 31 (అక్షర గళం):**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని గుండాల శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ గా సందీప్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఆలయం కమిటీ సభ్యులు



అరుణ్ నాయక్, మిరియాల పద్మ, కొమ్ము అంజయ్య, మల్లేష్ ముదిరాజ్ లింగమయ్య దేవాలయం శాఖ ఇన్ స్పెక్టర్ కవిత ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయం కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది అధికారులు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్ ను కమిటీ సభ్యులను శాలువలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేపల్లి పర్వత్ రెడ్డి, అర్చకులు కృష్ణయ్య శర్మ, శివకుమార్ శర్మ, నరహరి శర్మ, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో మౌలిక వసతుల కల్పించాలని కాలనీ వాసులు నిరసన

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:**
హైడ్రా కాపాడిన పార్కులో మౌలిక వసతుల కల్పనలో అధికారులు విఫలం చెందారని, వెంటనే మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు శనివారం శ్రమదానం చేసి నిరసన తెలిపారు. నిజాంపేట్ బృందావన్ కాలనీ నందు 20 గుంటల పార్క్ స్థలం కబ్జా అయితే కాలనీ వాసులతో కలిసి పోరాటం చేయడమే కాకుండా ఎడి సర్వే చేయించి రిపోర్ట్ సహాయంతో హైడ్రా ఫిర్యాదు




చేయగా, హైడ్రా పార్కింగ్ కాపాడి ఫెన్సింగ్ వేసిన, పార్క్ నందు అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ కి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకోకపోవడం వైఖరికి నిరసనగా కాలనీవాసుల స్వచ్ఛంద శ్రమదానం.. ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ కనీసం పార్కులను కాపాడకపోయిన మౌలిక వసతులు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల సతీష్, కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## పేద ప్రజలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్

### కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ ఉప సర్పంచ్ చెన్నోజ్ ప్రసాద్ చారి

**వెల్దండ జనవరి 27 (అక్షర గళం):**
అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసా నిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ ఉప సర్పంచ్ ప్రసాద్ చారి అన్నారు వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి కాయితి వీరారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 60,000వేల చెక్కును బాధితునికి పెద్దాపూర్ గ్రామంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశ మల్ల కృష్ణ ఉప సర్పంచ్ ప్రసాద్ చారి అందజేశారు.

ఈ కార్యక్రమం వార్డు సభ్యులు జక్కుల మల్లేష్ యాదవ్ కాటికి అంజయ్య మాదుగుల నిరంజన్ లలిత మల్లయ్య మమత అనిల్ కుమార్ శ్రీను శ్రీశైలం శ్రీను హరిలాల్ సుధాకర్ వెంకటేష్ కాటిక రాములు కృష్ణయ్య కొండల్ రెడ్డి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

**- ఉప్పల వెంకటేష్**

**ఆమనగల్లు, జనవరి 31 అక్షర గళం):**
ఆరు గ్యారంటీ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్, తలకొండ పల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ విమర్శించారు. సోమ వారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని వీటాయిపల్లికి చెందిన బీజేపీ నాయకులు వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిని కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ లకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంచుకొండ జగదీష్, గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్,



మాజీ సర్పంచ్ సాలయ్య, చంద్రు నాయక్, బన్నే, నరసింహ, మని, శేఖర్, శీను ప్రశాంత్, రమేష్, మల్లయ్య, గోపి, రాజేష్ నాయక్, సాయి, అనిల్, మల్లేష్, మనోజ్ కుమార్, వినోద్, ప్రసాద్, సిద్ధు, భద్ర తదితరులు పాల్గొన్నారు.



## ఆలోచనలకు వేదిక యూత్ పార్లమెంట్

◆ **మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, (అక్షర గళం):**
బాబు జగ్జీవన్ భవన్‌లో జరిగిన ఐవిజన్ యూత్ పార్లమెంట్ 2025 గ్రాండ్ ఫైనల్ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, డీఈవో రోహిణి, ఐవిజన్ గ్రూప్ ప్రతినిధి అంజలి మరియు ఇతర అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. నవంబర్ 28న ఏకకాలంలో 183 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన యూత్ పార్లమెంట్ 2025 ఈరోజు గ్రాండ్ ఫైనల్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మరియు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రదానం చేశారు. మొత్తం 216 మంది విద్యార్థులు ఫైనల్‌లో బహుమతులకు ఎంపిక అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యూత్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులు చట్టాల రూపకల్పన, ప్రజా సమస్యల చర్చ, భిన్న అభిప్రాయాల గౌరవం, ఆరోగ్యకర విమర్శలు ఎలా చేయాలో నేర్చుకుంటారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మంచి పౌరులు, బాధ్యతాయుత నాయకులుగా ఎదగగలరని అభిప్రాయపడ్డారు. “భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు




చేరుకునేందుకు మీ కృషి అవసరం. దేశ భవిష్యత్తు మీ చేతిలో ఉంది. యూత్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులు దేశ పార్లమెంట్ స్థాయి చర్చలకు సిద్ధమవుతారు.” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక విద్యా అధికారులు, ఐవిజన్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చర్లపల్లి వద్ద విషాద ఘటన

### తల్లీ ఇద్దరు పిల్లలు ఆత్మహత్య

### రైలుకింద పడి బలవన్మరణం

**హైదరాబాద్,జనవరి31(అక్షరగళం):**
నగరంలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. రైలుకింద పడి ఓ కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. శనివారం తెల్లవారుజామున చర్లపల్లి - ఘట్కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగింది. ఎంఎంటీఎస్ డౌన్‌లైన్‌లో తల్లి, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నట్టుగా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతులు బోడుప్పల్ హరితహారం కాలనీకి చెందిన పిన్నింటి విజయశాంతి రెడ్డి, విశాల్ రెడ్డి, చైతన్య రెడ్డిగా తెలుస్తోంది. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.
సమాచారం అందిన వెంటనే రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల వద్ద రైల్వే టికెట్లు, విలువైన వస్తువులు లేవని జీఆర్పీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబం ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి? ఆర్థికపరమైన ఇబ్బందులేమైనా ఉన్నాయా? ఇంకా ఇతర కారణాలా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కుటుంబం ఆత్మహత్యతో బోడుప్పల్ హరితహారం కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

### బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి అన్నారు. గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ నగర్ 2 బీహెచ్కె కాలనీ వద్ద బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి ఆధ్వర్యంలో నూతన ఓటర్ల నమోదు, ఓటర్ కార్డుల్లో చేర్పులు, మార్పులను చేపట్టేందుకు ఏర్పాటుచేసిన ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాల ఏర్పాటు చేయడంలో ఓటు హక్కు ఎంతో కీలకమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతి, యువకులకు ఓటు హక్కును కల్పించాలన్నారు. ఓటు హక్కును పొందడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెట్ల వెంకటేష్, ప్రసాద్, శివ నాయక్, మల్లేష్, స్థానిక కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు సాదుల వేణు, ముఖ్య సలహాదారులు షేక్ సాజిద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**- ప్రిన్సిపాల్ సుమన్ కుమార్**


**వెల్దండ జనవరి 31 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని కల్వకుర్తి ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయంలో 2026-2027 విద్య సంవత్సరానికి గాను కల్వకుర్తి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలోని ఆరో తరగతి ప్రవేశానికి



ఫిబ్రవరి 20 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సుమన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు 10 నుండి 13 సంవత్సరాల లోపు ఉండాలని దివ్యాంగులైన విద్యార్థి విద్యార్థినులకు రెండు సంవత్సరాలు సడలింపు ఉంటుందని ఆరో తరగతిలో మొత్తం 60 సీట్లు ఉంటాయని వీటిలో 30 సీట్లు బాలురకు 30 సీట్లు బాలికలకు ఉంటాయని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుమన్ కుమార్ తెలిపారు.



తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్



## అడిషనల్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన యం.సుదర్శన్‌కి శుభాకాంక్షలు

**కుత్బుల్లాపూర్,(అక్షరగళం):** అడిషనల్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన యం.సుదర్శన్‌ని శనివారం బాలానగర్ డీసీపీ పోలీస్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, జి.రాజ శేఖర్, ప్రసాద్ తదితర నాయకులు మర్యాదపూర్వక కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.




## ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ప్రతి ప్రొఫార్మా ముఖ్యమైనది

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:**
ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ప్రతి ప్రొఫార్మా ముఖ్యమైనదని, అందులో ప్రతి ప్రొఫార్మా పూరించి జాగ్రత్తగా అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిఓ, ఎపిఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ తరగతులను అర్థం చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పర్చుకోవాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలకు సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ విధులలో ఏవేని సందేహాలున్న హ్యాండ్ బుక్ ద్వారా, జోనల్ ఆఫీసర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఇవి బ్యాలెట్ బాక్స్ ఎలక్షన్స్ కాబట్టి చాలా జాగ్రత్తగా వ్యవహారించాలన్నారు. మొత్తం ఓటింగ్ లెక్కలు సరిగ్గా నిర్ధారించుకోవాలని, అందులో ఆడ, మగ ఓటర్ల లెక్కింపులో తప్పు లేకుండా రిజిస్టర్‌తో పాటు ట్యాలీ అయ్యేలా చూడాలన్నారు. ఎవరితోను వాదనలు చేయకుండా ప్రశాంతంగా ఓటింగ్ పూర్తి చేయాలన్నారు. ఏదైన సమస్యాత్మకంగా ఉందనిపిస్తే పోలీసు వారికి, జోనల్ ఆఫీసర్లకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ బూతులలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ నిర్వహణ నోడల్ అదికారి విజయ్ కుమారి, మాస్టర్ ట్రైనర్లు మురళీ, వేణు , పిఓలు, ఎపిఓలు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూం ఇండ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### అన్ని మౌలిక వసతులతో త్వరలోనే లబ్ధిదారులకు కేటాయిస్తాం
### గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతం
### కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటన

**అక్షర గళం, మేడ్చల్:**
జిహెచ్ ఎంసి పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీల్లో కొనసాగుతున్న పనులన్నిటిని త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి.వి.పి.గౌతం అధికారులను





ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న సుమారు 4000 ఇండ్ల పనులను, దాదాపుగా రూ. 300 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులపై క్షేత్ర స్థాయిలో పర్యటించి సమీక్షించారు.

శనివారం ఆయన బౌరంపేట, గాగిల్లాపూర్, దుండిగల్ ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి కాలనీలోనూ మౌలిక సదుపాయాలతో పాటు, పాఠశాల, పార్కు, అంగన్ వాడీ, రేషన్ షాపుల వంటివి తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు నివసించేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కాలనీలను బహుళ అంతస్తుల్లో బ్లాకులుగా నిర్మిస్తున్నందున , ప్రతి బ్లాక్ ను ఒక ప్రాజెక్టుగా తీసుకుని ప్రణాళికా బద్దంగా పనులన్నిటినీ పూర్తి చేయాలని నిర్దేశించారు. తొలుత బౌరంపేటలో వివిధ దశల్లో ఉన్న 15 బ్లాకుల్లోని 1620 ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ పనులను బ్లాకుల వారీగా పూర్తి చేయాలని, డ్రైనేజి, వాటర్ వర్క్స్, విద్యుత్ సంబంధిత పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే ఇక్కడ నివసించే వారి సౌకర్యార్ధం నిర్మిస్తున్నషాపులను కూడా తగినంత విస్తీర్ణంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, కాంట్రాక్టర్లకు సూచించారు. వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేస్తే, లబ్ధిదారులకు అలాట్ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆయన గాగిల్లాపూర్ లోని రెండు ప్రాజెక్టులను సందర్శించి, అక్కడి పనుల పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ స్థానికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీసి, ఈ కాలనీల్లో పునరావాసం కింద కేటాయించవలసిన వారికి తొలి ప్రాధాన్యంతో ఇండ్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టాలని ప్రత్యేక కార్యదర్శి విపి గౌతం పేర్కొన్నారు. ఈ కాలనీకి సంబంధించి అప్రోచ్ రోడ్ సరిగా లేని విషయాన్ని గమనించి ఇందుకు సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలని స్థానిక మున్సిపల్ అధికారులకు చెప్పారు. అటు తరువాత దుండిగల్‌లో నిర్మాణంలో ఉన్న 864 ఇండ్ల పురోగతిని సమిక్షించారు.డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులపై ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టి తీసుకుని వస్తే ఆయా విభాగాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఎం.చైతన్య కుమార్, పి.బలరాం, జి. విజయకుమార్, మేడ్చల్ మల్కాజిగిరి ప్రాజెక్టు డైరక్టర్ రమణమూర్తి. జిహెచ్ఎంసి అధికారులు పి.వి. రవీందర్, స్థానిక తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:**
సెంటర్ల వద్ద తగిన బందోబస్తుతోపాటు స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతర పర్యవేక్షణకు ఏర్పాటు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్ ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు.శనివారం మూడుచింతలపల్లిలోని జగన్గూడలోగల తెలంగాణ మైనారిటి రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్‌ను ఎన్నికల నోడల్ ఆఫీసర్ సాంబశివ రావుతో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు, కౌంటింగ్ సెంటర్లలో కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటుకు సంబంధించిన అంశాల పై పలు సలహాలు సూచించారు.

ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, మూడుచింతలపల్లి తహసీల్దారు ఇద్రిస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పర్చుకోవాలి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:**
శిక్షణ తరగతులను అర్థం చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పర్చుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరిఅన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిఓ, ఎపిఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ప్రతి ప్రొఫార్మా ముఖ్యమైనదని, అందులో ప్రతి ప్రొఫార్మా పూరించి జాగ్రత్తగా అందించాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలకు సాధారణ ఎన్నికలు-2026 లో భాగంగా ప్రిసైడింగ్ అధికారి , అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ విధులలో ఏవేని సందేహాలున్న హ్యాండ్ బుక్ ద్వారా, జోనల్ ఆఫీసర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు.. ఇవి బ్యాలెట్ బాక్స్ ఎలక్షన్స్ కాబట్టి




చాలా జాగ్రత్తగా వ్యవహారించా లన్నారు. మొత్తం ఓటింగ్ లెక్కలు సరిగ్గా నిర్ధారించుకోవాలని, అందులో ఆడ, మగ ఓటర్ల లెక్కింపులో తప్పులేకుండా రిజిస్టర్ తో పాటు ట్యాలీ అయ్యేలా చూడాలన్నారు. ఎవరితోను వాదనలు చేయకుండా ప్రశాంతంగా ఓటింగ్ పూర్తి చేయాలన్నారు. ఏదైన సమస్యాత్మకంగా ఉందనిపిస్తే పోలీసు వారికి, జోనల్ ఆఫీసర్లకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ బూతులలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ నిర్వహణ నోడల్ అదికారి విజయ్ కుమారి, మాస్టర్ ట్రైనర్లు మురళీ, వేణు , పిఓలు, ఎపిఓలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కోడ్ ఉన్నందున సోమవారం జిల్లాలో "ప్రజావాణి రద్దు"

### - కలెక్టర్ మను చౌదరి

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణ వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థలకు సాధారణ ఎన్నికలు-2026 కు సంబంధించి ఎన్నికల నియమావళి పాటించవలసి ఉన్నందున మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరగవలసిన "ప్రజావాణి"ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

## కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం

### ఎటిఎం వద్ద ఆరు లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

**హైదరాబాద్,జనవరి31(అక్షరగళం):** కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. ఉదయం 7 గంటలకు ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు రిషద్ అనే వ్యక్తి వచ్చాడు. అతడిని దుండగులు వెంబడించి.. కాల్పులు జరిపారు. రూ. 6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి తూటా గాయమైంది. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి.. ఘటనాస్థలిలో సీసీటీవీ ఫుటేజీని సుల్తాన్ బజార్ పోలీసులు పరిశీలిస్తున్నారు. బైకుపై వచ్చిన ఇద్దరు దుండుగులు కాల్పులు జరిపి డబ్బు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు రిషద్‌ను నాంపల్లిలోని వస్త్ర వ్యాపారిగా గుర్తించారు. ఘటనాస్థలిని డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. క్లూస్ టీమ్స్ ఇప్పటికే ప్రాథమిక వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఉదయం 6:30 నుంచి 7 గంటల మధ్య ఘటన జరిగినట్లు మాకు సమాచారం అందింది. కాల్పులు జరిగిన వెంటనే అలర్ట్ అయ్యాం. నిందితుల కోసం ఐదు బృందాలు గాలిస్తున్నాయి.

# సంపాదకీయం..

## బడ్జెట్ అంటేనే.. పన్నులు, రాయితీలు..కోతలు..!

బడ్జెట్ అంటేనే..పన్నులు, రాయితీలు..కోతలు..కేటాయింపులు అన్న సంగతి తెలిసిందే. అయితే ఎన్ని బడ్జెట్లు వచ్చినా సగటు భారతీయుడి బతుకుమారడం లేదు. ఉద్యం రాక కొందరు, చేసిన అప్పులు తీర్చ లేక కొందరు..పంటలకు గిట్టుబాటు లేక కొందరు రైతులు..పంటల కోసం చేసిన అప్పులు తీర్చలేక మరికొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశంలో మౌళికంగా మార్పులు తీసుకుని వచ్చేలా బడ్జెట ప్రభావం చేయలేకపోతోంది. అనేక విధాలుగా చేసే అవకావం ఉన్నా ప్రభుత్వాలు అచేతనంగా ఉంటున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోని బడ్జెట్లు ఎన్ని ప్రవేశ పెట్టినా భారత్ ఆర్థిక ప్రగతి గొర్రతోక బెత్తెడే అన్న చందంగా ఉండిపోతోంది. యన ఆరథిక వ్యవస్థలను అర్థం చేసుకోలేక పోతున్నారు. వచ్చే సంపదను వృథా చేస్తున్నారు. ప్రధానంగా రాజకీయంగా వారి దుబారా ఖర్చులకు ఎక్కువ మొత్తం వృదా అవుతోంది. రాజకీయ నేతల జీతాలు, పెన్షన్ల, విమాన ప్రయాణాలు, అద్దెలు,



అలవెన్సులు ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాండంత జాబితా తయారవుతుంది. వీటిలో కోతపెట్టే పని ఏ బడ్జెట్ చేయలేక పోయింది. మోడీ గత 12 ఏళ్లుగా కూడా ఈ పనిచేయలేదు. ఇకముందు చేస్తారన్న గ్యారెంటీ లేదు. రాజకీయ నాయకుల విలాసాలకు ప్రజల డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ప్రజలేమో అధికర ధరలు, పన్నులు, అప్పులతో తిప్పలు పడుతున్నారు. ఇక బడ్జెట్ విషయానికి వస్తే...గతంలో.. సంప్రదాయకంగా ఫిబ్రవరి చివరి రోజున సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ను ప్రవేశపెట్టేవారు. ఇంగ్లాండ్, భారత్ లలో ఒకేసారి ప్రకటనలు చేయగలిగే వలసరాజ్యాల యుగం నాటి సంప్రదాయంగా ఈ సమయం ఉంది. అయితే భారతదేశం లండన్ సమయం కంటే 4 గంటల 30 నిమిషాలు ముందుంది. కాబట్టి ఇండియాలో సాయంత్రం 5 గంటలకు బడ్జెట్ ను సమర్పించడం వల్ల యూకేలో మరుసటి రోజు ఉదయం పూట జరుగుతుంది. అయితే 1999లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. తొలిసారి సమయాన్ని మార్చారు. అప్పటి నుంచి బడ్జెట్‌లను ఉదయం 11 గంటలకు ప్రవేశపెడుతున్నారు. ఒకప్పుడు బడ్జెట్‌ను ఫిబ్రవరి నెల చివరి రోజున ప్రవేశపెట్టేవారు. ఇది బ్రిటీష్ కాలం నుంచి వస్తున్న ఆచారం. అయితే 2017లో మోదీ ప్రభుత్వం ఈ పాత సంప్రదాయాన్ని మార్చేసింది. నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. మన దేశంలో కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. ఫిబ్రవరి చివరలోబడ్జెట్ ప్రవేశపెడితే, దానిపై చర్చలు ముగిసిన.. నిధులు విడుదలయ్యే సరికి మే లేదా జూన్ నెల వచ్చేది. దీనివల్ల కొత్త పథకాలు ప్రారంభం కావడానికి ఆలస్యమయ్యేది. అందువల్ల ఫిబ్రవరి 1నే బడ్జెట్ ప్రవేశపెడితే.. ఏప్రిల్ 1 నాటికి అన్ని ప్రక్రియలు పూర్తవుతాయి. 2017 నుంచి ఈ కారణంతోనే ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశ పెడుతున్నారు. ఇకపోతే దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆదివారం నాడు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 1 ఆదివారం అయినా సంప్రదాయం మేరకు బడ్జెట్ ప్రతిపాదనలకు పార్లమెంట్ సిద్ధంగా ఉంది. వరుసగా 9వసారి ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్ ను ప్రవేశపెడతారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లలో ఏవైనా మార్పులు ఉంటాయా? అని మధ్యతరగతి ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని పెంచుతారని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రకటనలు మీ భవిష్యత్తు పొదుపు, పన్ను బాధ్యతలపై నేరుగా ప్రభావం చూపుతాయి. గ్యాస్ సిలిండర్ ధరల సవరణ ప్రతి నెల ఒకటో తేదీన ఆయిల్ కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సమీక్షిస్తాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల్లో వస్తున్న మార్పుల వల్ల ఫిబ్రవరి 1 ఉదయం 6 గంటలకే కొత్త ధరలు వెల్లడికానున్నాయి. కమర్షియల్ సిలిండర్లతో పాటు డొమెస్టిక్ గ్యాస్ ధరలు తగ్గుతాయా లేదా పెరుగుతాయా అనేది నేడు తేలిపోతుంది.బ్యాంకింగ్, సేవింగ్స్ ఖాతాల్లో మార్పులు ఫిబ్రవరి 1 నుంచి ఐసీఐసీఐ , హెచ్‌డీఎఫ్‌సి వంటి ప్రధాన బ్యాంకులు తమ సేవా రుసుములను మార్చుతున్నాయి. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్లు, రెంట్ పేమెంట్స్‌పై అదనపు ఛార్జీలు , మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ నియమాలు మారబోతున్నాయి. కొన్ని బ్యాంకులు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను కూడా సవరించే అవకాశం ఉంది. ఇవన్నీ ఇలావుంటే దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4శాతం లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024–25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్– డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024–25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్–డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బ్జడెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు. ఇంతగా లోటు ఉన్నప్పటికీ ఆదాయం బాగానే ఉంటోంది. అంటే వృధా ఖర్చుల కారణంగా ద్రవ్యలోటు పెరుగుతోంది. దీనికి నిర్మలమ్మ సమాధానం బడ్జెట్‌లో లభిస్తుందా లేదా అన్నది చూడాలి. వృధాఖర్చుల, అనవసర పథకాలు వంటివన్నీ పక్కన పెడితే తప్ప దేశం గట్టెక్కదు.

## నేటి బడ్జెట్ నిర్మలమ్మకు ప్రత్యేకం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ఆదివారం కేంద్ర బడ్జెట్ 2026–27ను ప్రవేశపెట్టనున్నారు. ఈ ఏడాదితో ఆమె వరుసగా తొమ్మిదో సారి బడ్జెట్ ప్రవేశ పెట్టడం ద్వారా మహిళా ఆర్థికమంత్రిగా రికార్డు సాధించనున్నారు. ఇది భారతదేశ పార్లమెంటరీ, ఆర్థిక చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి. గతంలో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధిక బడ్జెట్లను(10) ప్రవేశపెట్టిన రికార్డును కలిగి ఉన్నారు. అయితే ఆయన వరుసగా కాకుండా.. వేరు వేరు ప్రధానుల హయాంలో ప్రవేశపెట్టారు.

అయితే నిర్మలమ్మ బడ్జెట్‌లో మెరుపులు ఉంటాయా...కొరడా దెబ్బలు తప్పవా అన్న దాని కోసం దేశం ఎదురు చూస్తోంది. ప్రపంచ ఆర్థిక మందగమనం నేపథ్యంలో బడ్జెట్‌పై ఊహాగానాలు చెలరేగుతున్నాయి. 1959–64లో ఆర్థిక మంత్రిగా మొరార్జీ దేశాయ్ మొత్తం 6 బడ్జెట్ లను, 1967–69 మధ్య 4 బడ్జెట్ లను సమర్పించారు. మాజీ ఆర్థిక మంత్రులు పి.చిదంబరం తొమ్మిది, ప్రణబ్ ముఖర్జీ ఎనిమిది బడ్జెట్ లను సమర్పించారు. వీరిద్దరూ వేరు వేరు ప్రధానుల హయాంలలో ఈ బడ్జెట్ లను ప్రవేశ పెట్టారు. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో వరుసగా 9బడ్జెట్ లను ప్రవేశపెట్టి.. ఒకే ప్రధాని హయాంలో అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రిగా సీతారామన్ చరిత్ర సృష్టించనున్నారు. 2020 ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రజెంటేషన్ 2 గంటల 42 నిమిషాల పాటు చేసి అత్యంత పొడవైన బడ్జెట్ ప్రసంగం చేసిన రికార్డును నెలకొల్పారు. ఆ సమయంలో ఇంకా రెండు పేజీలు మిగిలి ఉండగానే తన ప్రసంగాన్ని ముగించారు. 1977లో హిరుభాయ్ ముల్జీభాయ్ పటేల్ చేసిన తాత్కాలిక బ్జడెట్ ప్రసంగం ఇప్పటివరకు అతి చిన్నదిగా ఉంది. ఇందులో 800 పదాలు మాత్రమే ఉంటాయి.

# రాజ్యాంగం... దేశానికి కొత్త రాజ్యాంగం!

రాజ్యాంగం అంటే ఏమిటి? ఒక దేశ సర్వోన్నత మైన, మౌలికమైన చట్టాలు, చట్ట విధానాల కూర్పు రాజ్యాంగం అని ప్రాథమికంగా మనం తెలుసుకోవచ్చు. రాజ్యాంగానికి లోబడే ప్రభుత్వ నిర్మాణం, అధికారాలు, విధానాలు, పౌరుల హక్కులు ఉంటాయి; ఉండాలి. మనదేశానికి సంబంధించి రాజ్యాంగం అన్నది 26/1/1950 నుండి అమలులోకి వచ్చింది. అంతకు ముందు ఇంగ్లిష్ పాలనలో రాజ్యాంగం అన్నది లేదు. స్వతంత్ర భారతం వచ్చాక ఈ రాజ్యాంగం ఆచరణబద్ధం అయింది.

మన దేశ రాజ్యాంగానికి ఆధార రచన లేదా మూల రాజ్యాంగాన్ని రాసింది సర్.బెణగళ్ నరసింహ రావు. ఆయన 1946లో మొదలు పెట్టి 1948లో మన దేశ మౌలిక లేదా ఆధార రాజ్యాంగాన్ని రాయడం పూర్తి చేశారు. అటు తరువాత అది అంబేద్కర్ అధ్యక్షుడుగా ఉన్న 8 మంది సభ్యుల కమిటికి వెళ్లింది. రాజ్యాంగం రచనలో 22కమిటీల సభ్యుల భాగస్వామ్యం ఉంది.

అంతవరకూ 'ప్రజా క్షేత్రంలోనూ, రాజకీయం గానూ ఎంత మాత్రమూ ఆదరణ లేని, పలు తిర స్కారాలను, వైఫల్యాలను పొందిన అంబేద్కర్ కొందరు విద్యావంతుల సంస్కారం, సహకారంతో మాత్రమే రాజ్యాంగ కమిటీ అధ్యక్షుడయ్యారు' అన్న వాస్తవాన్ని ఈ సందర్భంగా తెలుసుకోవడం, స్మరించుకోవడం అవసరం.

రాజ్యాంగ నిర్మాణంలో పునాది, కీలకం అయిన సర్. బెణగళ్ నరసింహారావును లేకుండా చేసి రాజ్యాంగ కర్తృత్వాన్ని పూర్తిగా అంబేద్కర్‌కు అంటగట్టడం గత కొన్ని దశాబ్దులుగా దేశంలో బలపడుతూ వస్తున్న అపాయకరమైన దోషం. ఇది

ఏదైనా కుట్రలో భాగమా? పలువురి కృషి ఫలితం ఇవాళ్టి మన రాజ్యాంగం. పలువురి మేధ, ఆలోచన, కృషి వీటిని అంబేద్కర్‌కు మాత్రమే ఆపాదించడం చదువు, నిజం, తెలివిడి వీటికి వ్యతిరేకం.

10–35 (29+6R35) మార్కుల చదువుకు అతీతంగా రాజ్యాంగ కర్తృత్వం విషయంలో మనకు మనోవికాసం, 'ఉన్న విషయం' ఇకనైనా అవసరం. మోసం ఎంత కాలం? ద్వేషం ఎన్నేళ్లు? ఇకచాలు.

1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడు బీ.ఆర్. అంబేద్కర్ ముసాయిదాను ప్రవేశపెడుతూ 'భారత రాజ్యాంగ రచనలో సింహభాగం కర్తృత్వం బెణగళ్ నరసింహారావుది' అన్న నిజాన్ని గట్టిగా చెప్పారు. ఆ అంబేద్కర్ మాటలు సరైన అవగాహనను ఇస్తున్నాయి.

రాజ్యాంగం ముసాయిదాను రూపొందించే ముందు సర్. బెణగళ్ నరసింహారావు జర్మనీ, అమెరికా, కెనడా, ఐర్లాండ్, బ్రిటన్ దేశాల్లో పర్యటించారు. ఆ దేశాల న్యాయ నిపుణులతో చర్చలు చేశారు. అప్పటి అమెరిక సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఫెలిక్స్ ఫ్రాంక్ ఫార్టర్ ఇచ్చిన విలువైన సూచనలనెన్నో బెనగళ్ తీసుకున్నారు. తన విస్తృత పరిచయాలను ఉపయోగించుకుని ఇతర దేశాల్లోని పలు ప్రముఖ న్యాయ వేత్తల సలహాలు తీసుకున్నారు. ఈ పని అంబేద్కర్ చెయ్యలేదు. చెయ్యగల పరిధి, విస్తృతి, అవకాశం, ఆలోచన అంబేద్కర్‌కు ఉన్నట్టు లేదు.

1935లో బ్రిటిష్ పా(ర్)లమంట్ ఆమోదించిన భారతదేశ చట్టాలను నరసింహారావు పరిగణనలోకి తీసుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం నరసింహ రావుకు 'సర్ – నైట్ హుడ్'ను ప్రదానం చేసింది. దేశ ప్రజలతోనే కాదు బ్రిటిష్ పాలకుల చేత కూడా 'అంబేద్కర్ తిరస్కరించబడ్డారు' అన్న సత్యాన్ని తెలుసుకోవడం కులోన్మాదానికి, అసభ్యకరమైన భాషకు, సంకుచిత్వానికి అతీతమైన 'సంస్కారం', మనోవికాసం.

నరసింహారావు కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. ఆయన తన అనుభవం, చదువు, జ్ఞానంతో భారత రాజ్యాంగం మౌలిక ప్రతిని సిద్ధం చేశారు. 1947 అక్టోబర్‌లో నరసింహారావు రాజ్యాంగం ముసాయిదాను, ఇతర కమిటీల నివేదికలను రాజ్యాంగ సభకు సమర్పించారు. వీటిపై విస్తృత చర్చలు జరిగాయి. 1948 ఫెబ్రుఅరి (టవఎతీఋతీఎ)లో ఈ ముసాయిదా తొలి రచనను ప్రచురించారు.

ఈ కీలకమైన ముసాయిదాపై ప్రజాభిప్రాయం కోసం, విమర్శకుల సూచనలు, సలహాల కోసం ఎనిమిది నెలల సుదీర్ఘ సమయమిచ్చారు. ఆ కాలంలో వచ్చిన వందలాది అంశాలను పరిగణనలోకి తీసుకుని 1948 నవంబర్ 4న ఈ ముసాయిదాను ఆధికారికంగా డ్రాఫ్టింగ్ కమిటీ ముందుకు తీసుకొచ్చారు. అక్కడ మొదటి పఠనం లేదా ప్రెజెంటేషన్ జరిగింది.

ఆ తర్వాత సంవత్సరం కాలం పాట అధికరణాలపై విస్తృత చర్చ జరిగింది. అలా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు తీసుకుంటూ సవరించిన ముసాయిదా రెండో, మూడో మీటింగ్ జరిగింది. మూడో పఠనం వరకు అందిన సూచనలను పరిశీలించి మార్పులు చేర్పులు చేశాక ఆ ముసాయిదా ప్రతిని 1949 నవంబర్ 25న అంబేద్కర్ రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంలో అంబేద్కర్ బెనగళ్ నరసింగరావు సేవల్ని ప్రస్తావించి కొనియాడారు. అలాగే మిగతా సభ్యుల సేవలు



ఎంతో విలువైనవి అన్నారు. రాజ్యాంగ రచన కమిటీ (డ్రాఫ్టింగ్ కమిటీ) 114 సార్లు సమావేశమై చర్చలు చేసింది. ఇందుకోసం రెండు సంవత్సరాల పదకొండు నెలల 17 రోజుల సమయం పట్టింది. ముసాయిదాపై 7,635 సవరణలు అందగా 2,473 సవరణలు అంగీకరా యోగ్యం అయ్యాయి. ఇక్కడ డాక్టర్ సచ్చిదానంద సిన్హా పేరు కూడా స్మరణీయం.


రాజ్యాంగానికి పీఠికను అప్పటి ప్రధాని నెహ్రూ రాశారు. కమిటీ సభ్యులైన అల్లాడి కుప్పు స్వామి అయ్యర్, కె.ఎమ్. మున్షీ, డీ.పీ ఖైతాన్ ప్రభృతుల ఆలోచనలు, మేధ కూడా రాజ్యాంగ రచనలో ఇమిడాయి. ఇలా పలువురి సమష్టి కృషి అవగాహన, ఆలోచనల ఫలితంగా రాజ్యాంగం సాకారమైంది. దేశ రాజ్యాంగం నిర్మాణానికి ప్రధానంగా సర్. బెణగళ్ నరసింహారావు చదువు, లోక జ్ఞానం, దీక్ష, కృషి ఆధారం; మూలం.


'బెణగళ్ నరసింహారావు అంతర్జాతీయ కోర్టులో తొలి భారతీయ న్యాయమూర్తి! (ICJÑ 1952–53) కులాతీతంగా నరసింహారావు స్థాయి, స్థితి, ఎదుగుదల అంబేద్కర్ సాధించగలిగారా? నరసింహారావు న్యాయశాస్త్ర కోవిదుడిగా ప్రపంచ ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారతదేశ ప్రతినిధిగా, యూ. ఎన్. సెక్రటరీ జనరల్‌గా సేవలను అందిచారు. రాజ్యాంగం పని పూర్తి అయిన 1950 తరువాత అంబేద్కర్ జీవితం ఏమిటి? 1956లో మరణించేంత వరకూ అంబేద్కర్ సఫలమైన సందర్భాలు ఉన్నాయా?

రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 ఏళ్లయింది. ఇవాళ దేశ వ్యతిరేక, సంఘ వ్యతిరేక శక్తులు "మనువాదం, మనుస్మృతి" వంటి పడికట్టు లేదా ఊతపదాలతో చదువు ప్రాసంగికత లేకుండా ఆగం చేస్తున్నట్టుగా "రాజ్యాంగం... రాజ్యాంగం..." అంటూనూ ఆగం చేస్తున్నారు. ఇవాళ రాజ్యాంగం అన్నది కూడా పడికట్టు పదం, ఊత పదం అయిపోయింది.

మన రాజ్యాంగం విషయంగా ప్రతి పౌరుడూ సరైన, సమగ్రమైన అలోచన చెయ్యాలి. మనకు స్వతంత్రం వచ్చాక దేశానికి రాజ్యాంగం కావాలి అనుకున్నాక కొన్ని ఇతర దేశాల రాజ్యాంగాల ఆధారంగానూ అప్పటికే ఉన్న కొన్ని బ్రిటిష్ ప్రభుత్వ విధానాలతోనూ అప్పటి దేశ, కాల అవసరాల కోసమూనూ మనదేశ రాజ్యాంగం ఏర్పడింది. ఇవాళ్టి, రేపటి దేశ, పౌరుల అవసరాలకు, స్థిరతకు అప్పటి ఈ రాజ్యాంగమే పనికొస్తుందా?

కాంగ్రెస్ ప్రభుత్వం 100 సార్లకు పైగా రాజ్యాంగాన్ని మార్చింది. 1950 రాజ్యాంగంలోని లేని ఎన్నిటినో తరువాతి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలోకి చొప్పించింది. వాటి ప్రభావం వల్ల దేశం ఎంతో నష్టపోయింది కూడా. ఆర్టికల్స్ 25, 28, 30 (1950), HRCE చట్టం (1951), హెచ్‌సిబి ఎంపిఎల్ (1956), లౌకికవాదం (1975), మైనారిటీ హక్కుల చట్టం (1992), వక్ఫ్ చట్టం (1995), 1992లో ప్రార్థనా స్థలాల చట్టం వంటివి 1950నాటి రాజ్యాంగంలో లేవు. 1954, 1964, 1995, మరియు 2013 సంవత్సరాల్లో, (హిందువుల నుండి భూమిని



స్వాధీనం చేసుకోవడానికి) వక్ఫ్ సవరణ చట్టాల వంటివి రాజ్యాంగంలో వచ్చిన అపాయకరమైన మార్పుల్లో కొన్ని.

దేనికైనా మార్పు తప్పనిసరి. మార్పు అన్నది లేకపోవడం దోషం; హానికరం. రాజ్యాంగం కూడా దేశ అవసరాల, పెద్ద శాతం ప్రజ అవసరాల పరంగా పెనుమార్పులకు సిద్ధం అవాలి.

రాజ్యాంగం బండ రాయి కాదు కదా? ఇప్పటి దేశ, కాల పరిస్థితులకు, భవిష్యత్ అవసరాలకు 76యేళ్ల నాటి రాజ్యాంగం ఎంత వరకూ ఉపయుక్తంగా ఉంటుంది? 76యేళ్ల తరువాత కూడా 76యేళ్ల నాటి రాజ్యాంగం మారకూడదా? దేశ గమనానికి రాజ్యాంగం మార్పులు అత్యవసరం కాదా?

పాత రాజ్యాంగం స్థానంలోకి కొత్త రాజ్యాంగం రావలసిన అవసరం లేదా? దేశం, ప్రపంచం, ప్రజ మారుతోంది కదా? జీవన విధానాలు, ప్రమాణాలు మారుతున్నాయి కదా? రాజ్యాంగం కూడా మారాల్సిన అవసరం లేదా? 1950 నాటి రాజ్యాంగం 2050 నాటికి, 2150 నాటికి కూడా సమూలమైన మార్పులు లేకుండా కొనసాగడం సరైనదే అవుతుందా? ఆలోచిద్దాం...

దేశ రాజ్యాంగం దేశ అవసరాలకు, నిర్వహణకు, భద్రతకు, పురోగతికి, పౌరుల సంక్షేమానికి, రక్షణకు ఉద్దేశించినది. రాజ్యాంగం అన్నది "రాజ్యాంగం... రాజ్యాంగం..." అంటూ ఆగం చేస్తున్న దేశ, జన వ్యతిరేక శక్తులు, విదేశీ మతాల మాఫియాలు, కులోన్మాదంతో సగటు పౌరుడికి హాని చేస్తున్న దుష్టశక్తులు, హిందూ విద్వేషవాదులు, హిందూ ప్రజ వినాశకర శక్తులకు రక్షణ కవచం కాకూడదు.

'దేశానికి కొత్త రాజ్యాంగం అవసరం వచ్చేసింది' అని తెలుసుకోవాల్సిన కాలం కాదా ఇది? ఇన్నాళ్లలా కాకుండా ఇకనైనా దేశంలోని పెద్ద శాతం ప్రజలైన హిందువుల భద్రతకు, హిందువుల భవిష్యత్తుకు, హిందువుల జీవనాలకు, హిందువుల ఆస్తులకు భరోసా ఇచ్చే కొత్త రాజ్యాంగం అవసరం లేదా?

దేశాన్ని దెబ్బకొడుతున్న విదేశీ మతాల మాఫియాలను సమూలంగా నిర్మూలించే కొత్త రాజ్యాంగం అవసరం లేదా? దేశంలో కుల ఆరాచకాలను తొలగించే కొత్త రాజ్యాంగం అవసరం లేదా? విదేశీ మతాలకు, కుట్రలకు బలవ్వని దేశ భవిష్యత్ కోసం కొత్త రాజ్యాంగం అవసరం లేదా? భారతీయతను పరిరక్షించే, సుస్థిరపరిచే కొత్త రాజ్యాంగం అవసరం లేదా?

'విదేశీ మత సంతుష్టీకరణ, కుల సంతుష్టీకరణ దేశ సంతుష్టీకరణను ఇవ్వవు'. కులాల వారీగా, మతాల వారీగా చట్టాలున్న దేశంగా కాదు... దేశ పౌరులందరూ రాజ్యాంగం పరంగా సమానంగా ధైర్యంగా దేశంలో మనుగడ చెయ్యగలిగే రాజ్యాంగ దేశం కదా మనకు కావలసింది?

దేశంలోని బాధ్యతాయుతమైన పౌరుల సహకారంతో మనదేశ కేంద్ర ప్రజా ప్రభుత్వం దేశ సుస్థిరత, మతాతీత ప్రగతి, కులాతీత అభివృద్ధి, హిందూ జన రక్షణ కోసం కొత్త రాజ్యాంగం ఆలోచన చెయ్యాలి; కొత్త రాజ్యాంగం నిర్మాణం దిశగా కేంద్ర ప్రజా ప్రభుత్వం సరైన అడుగులు వేయాలి.

# 'దాదా' మృతితో 'మహా'పవార్‌లో శూన్యత

పవార్‌ల కుటుంబానికి కంచుకోట బారామతి నియోజక వర్గం. అజిత్ పవార్ నేతృత్వంలో పవార్ వర్గాలు ఒకటై ముందుకు వెళ్లడానికి గత కొద్ది నెలలుగా జరుగుతున్న ప్రయత్నాలు ఇప్పుడు అజిత్ పవార్ అకాల మరణంతో అడుగంటిపోయే విషాద పరిస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని వారాల క్రితం పవార్ కుటుంబం మొత్తం ఎన్‌సిపికి నాయకత్వ బాధ్యత అప్పగించడానికి అంగీకరించింది. ఈ మేరకు శరద్ పవార్ కాస్త వెనక్కు తగ్గడానికి సిద్ధమయ్యారు. వారసత్వ బాధ్యతపై చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. రేపోమాపో ఎన్‌సిపి పూర్తి బాధ్యత అజిత్ పవార్‌కే అప్పగించనున్న తరుణంలో విధి వక్రించింది. వంశపారం పర్య రాజకీయాలను ఒక పద్ధతి ప్రకారం కేంద్రీకృతం చేయడానికి అజిత్ పవార్ నాయకత్వం తప్పనిసరి అనిపిస్తోంది. 1959 జులై 22న జన్మించిన అజిత్ పవార్ తన చిన్నాన్న శరద్ పవార్ మార్గదర్శకత్వంలో రాజకీయ అరంగేట్రం చేశారు. బారామతి నియోజకవర్గం నుంచి మొట్టమొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు. తరువా తన చిన్నాన్న శరద్ పవార్ కోసం తన స్థానాన్ని త్యాగం చేయడంతో శరద్ పవార్ కేంద్ర రక్షణ మంత్రిగా పదవిని పొందడానికి పివి నరసింహారావు ప్రభుత్వంలో వీలైంది. అజిత్ పవార్ తన చిన్నాన్న రాజకీయ శైలిని అత్యంత వేగంగా అలవర్చుకున్నారు. ఎంతో క్రమశిక్షణతో, అంకిత భావంతో రాజకీయాల్లో పరిణితి చెందారు.

రోజూ ఉదయం 6 గంటలకే తన కార్యక్రమాలను ప్రారంభించి నాయకులకు ఆదర్శమయ్యారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి అల్కహాలు, స్మోకింగ్ అలవాట్లకు దూరంగా ఉండేవారు. రోజూ ఉదయం నాలుగైదు కిలోమీటర్లు దూరం నడిచేవారు. రాజకీయ కేంద్రంగా రాణించే సామర్థ్యాన్ని సాధించారు. రాష్ట్ర స్థాయి నాయకుడే అయినప్పటికీ బారామతి నియోజకవర్గం ఆయన కనుసన్నల్లో ఉండేది. ఆయన విజయాలు, అపజయాల్లోనూ బారామతి నియోజక వర్గం ఆయనకే అండదండలు అందించేది. అందువల్లనే 8 సార్లు బారామతి నియోజకవర్గం ఎంఎల్‌ఎగా రికార్డు స్థాయి మెజారిటీతో విజయం సాధించగలిగారు. ఆయనను అంతా ఆప్యాయంగా 'దాదా' అని పిలిచేవారు. క్షేత్రస్థాయి కార్యకర్తలను ఎంఎల్‌ఎలుగా, ఎంపిలుగా ఉన్నత స్థాయిలోకి తీసుకు రావడానికి కృషి చేసేవారు. పార్టీలకు అతీతంగా ఆయన మాటను నాయకులంతా పాటించేవారు. సీనియర్ నాయకులు కూడా ఆయనకు పోటీగా ఉండడానికి ఇష్టపడేవారు కాదు. చట్టాలు, నిబంధనలు, పాలనా విధానాలపై ఆయనకు విస్తృత పరిజ్ఞానం ఉండేది.

బలమైన సామాజిక నాయకునిగా ముద్ర గల గట్టి నేత అజిత్ పవార్. ప్రజా సంక్షేమం కోసం ఏమి చేయాలి? వ్యవస్థలను ఎలా వినియోగించాలి? అన్నది ఆయనకు బాగా



తెలుసు. కేవలం శుష్క వాగ్దానాలతో పైపై మెరమెచ్చు ప్రణాళికలతో ప్రజలను తప్పుదారి పట్టించేవారు కాదు. దీంతో ఆయన మంచి సమర్థత గల పాలనాదక్షుడు అన్న పేరు సంపాదించగలిగారు. అజిత్ పవార్ తన చిన్నాన్న శరద్ పవార్ నీడలో ఏనాడు అసౌకర్యానికి గురైనట్టు కనిపించేవారు కాదు. శరద్ పవార్ కేంద్ర రాజకీయాలపై దృష్టి కేంద్రీకరిస్తుంటే అజిత్ రాష్ట్రస్థాయి వ్యవహారాలను చూసుకునేవారు. ఈ విధంగా దాదాపు మూడు దశాబ్దాలు ఈ బాధ్యతల పంపకం చాలా సున్నితం జరిగింది. శరద్ పవార్ కూడా అత్యంత జాగ్రత్తగా తన కుమార్తె సుప్రియా సూలేకు, తన అన్న కొడుకు అజిత్ పవార్‌కు బాధత్యలు పంపిణీ చేసేవారు. వీరిద్దరి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా జాగ్రత్త పడేవారు. అయితే అజిత్ పవార్ మహారాష్ట్ర రాజకీయాల్లో అట్టడుగు స్థాయి నుంచి కీలకమైన వ్యక్తిగా గుర్తింపు పొందగా, సుప్రియా జాతీయ రాజకీయాల్లో పాత్ర వహించడానికి ప్రయత్నించేది. రాజకీయ విభేదాలు తలెత్తినప్పుడు శరద్ పవార్ తన అన్న కొడుకు అజిత్ కే రక్షణ కల్పించేవారు.

అజిత్ కూడా తన చిన్నాన్న గీసిన గిరి దాటే వారు కాదు. శరద్ పవార్ మాటే తుది నిర్ణయంగా భావించేవారు. కొన్ని సార్లు వీరి భావాలు వేరైనా పరస్పర గౌరవ ప్రతిపత్తి పాలనా పరంగా వ్యక్తమయ్యేది. అజిత్ పవార్ తర్వాత బిజెపితో పొత్తు పెట్టుకొని, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం అయ్యారు . ఈ విధంగా బిజెపితో పొత్తు ఉన్నప్పటికీ సెక్యులరిజం ప్రగతిదాయ విలువలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. సాహు పూలే అంబేద్కర్ సిద్ధాంతాలను తాను విడిచిపెట్టబోనని బహిరంగంగా పదేపదే ప్రకటించేవారు. డిప్యూటీ సిఎంగా ఎనిమిది సార్లు పదవిని నిర్వహించినా ముఖ్యమంత్రి పీఠంపై మక్కువ చూపించేవారు. తన కెరీర్‌లో అనేక సార్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని సాధించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. ఆయన వయస్సు కూడా దీనికి సహరించేది. అయినప్పటికీ ఆయనకు రాజకీయంగా ముఖ్యమంతి కావడానికి కాలం కలిసి రాలేదు.

అనేక ముఖ్యమంత్రుల వద్ద ఉప ముఖ్యమంత్రులుగానే కాలం గడపవలసి వచ్చేది. వివిధ నాయకత్వ లక్షణాలను విజయ వంతంగా అలవర్చుకున్నారు. పరిస్థితులను బట్టి రాజకీయంగా త్వరగా నిర్ణయాలు తీసుకునేవారు. సామాన్య ప్రజానీకంతో నిత్యం సంబంధం నెరపేవారు. అనేక కుంభకోణాల్లో ప్రమేయం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. జలవనరుల మంత్రిగా ఉన్నప్పుడు రూ. 70,000 కోట్ల ఇరిగేషన్ స్కాం జరిగినట్టు ఆరోపణ వచ్చింది. అయితే ఇవన్నీ రాజకీయంగా తనను అప్రతిష్టపాలు చేయడానికి సృష్టించినవేనని తిప్పికొట్టారు. ఎంఎస్‌సిబి రుణ కుంభకోణం జరిగిందని అజిత్‌పై ఆరోపణ వచ్చినా ఆ ఆర్థిక నేరాల్లో ఎలాంటి సాక్ష్యం లేకపోవడంతో 2024లో అది ముగిసింది. ఎన్ని వివాదాలు ఎదురైనా ప్రజల నమ్మకం మాత్రం అజిత్‌పై చెక్కుచెదరలేదు. అజిత్ పవార్ మరణం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వానికి ఎలాంటి నష్టం కలిగించకపోయినా, ఎన్‌సిపి వర్గాల్లో మాత్రం అనిశ్చితిని సృష్టిస్తుంది. అజిత్ అంతటి సమర్థులు ఎన్‌సిపిలో ఎవరున్నారు? అన్న ప్రశ్న ఎదురైంది




# ఇషాన్ తుఫాన్

- అంతర్జాతీయ టీ20ల్లో తక్కువ బంతుల్లో (1,822) మూడు వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా సూర్యకుమార్.
- ద్వైపాక్షిక సిరీస్‌లో ఎక్కువ సిక్సర్లు (69) బాదిన జట్టుగా భారత్.
- న్యూజిలాండ్‌పై టీ20ల్లో అత్యధిక స్కోరు (271) చేసిన జట్టుగా భారత్.
- అంతర్జాతీయ టీ20ల్లో ఎక్కువ పరుగులిచ్చి (51) ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా అర్ష్‌దీప్.

- 4-1తో సిరీస్ కైవసం
- 42 బంతుల్లో శతకం
- చెలరేగిన సూర్య, హార్దిక్
- అర్ష్‌దీప్ పాంచ్ పటాకా
- ఆఖరి టీ20లో కివీస్‌పై భారత్ విజయం

**తిరువనంతపురం:** టీ20 వరల్డ్‌కపనకు ముందు టీమిండియా అదిరే ప్రదర్శనతో ఆకట్టుకుంది. మెగా టోర్నీలో ప్రత్యర్థులారా.. ఇక కాచుకోండి అన్నట్టుగా జట్టులోని పవర్ హిట్టర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఇషాన్ కిషన్ (43 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 103) తన టీ20 కెరీర్‌లో తొలి శతకంతో జట్టులో స్థానాన్ని ఖాయం చేసుకోగా.. అటు కెప్టెన్ సూర్యకుమార్ (30 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 63) ఫామ్‌ను కొనసాగించాడు. దీంతో శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో టీ20లో భారత్ 46 పరుగుల తేడాతో నెగ్గింది. 4-1తో సిరీ?సను ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 271 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 42), అభిషేక్ శర్మ (16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) చెలరేగారు. ఫెర్గూసన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫిన్ అలెన్ (38 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 80), రచిన్ రవీంద్ర (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30), ఇష్ సోధీ (15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 33) మాత్రమే రాణించారు. అర్ష్‌దీ?పనకు 5, అక్షర్‌కు 3 వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఇషాన్.. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా సూర్యకుమార్ నిలిచారు.







### ఆలెన్ పోరాడినా..:

272 పరుగుల ఛేదనను ఓపెనర్ ఆలెన్ ధాటిగా ఆరంభించాడు. అతడు క్రీజులో ఉన్నంత సేపు కివీస్ పోటీలోనే ఉంది. తొలి ఓవర్‌లో 3 ఫోర్లు.. మూడో ఓవర్‌లో 23 రన్స్ అందించిన ఆలెన్ ధాటికి పవర్‌ప్లేలో కివీస్ 79/1 స్కోరుతో నిలిచింది. ఈ క్రమంలో 22 బంతుల్లోనే ఆలెన్ అర్ధసెంచరీ కూడా పూర్తయింది. తొమ్మిదో ఓవర్‌లో ఆలెన్‌ను అక్షర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు రచిన్‌తో కలిసి అందించిన 100 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రచిన్ కూడా వేగంగా ఆడడంతో కివీస్ పదో ఓవర్‌లో 131/2 స్కోరుతో భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. కానీ ఆ తర్వాత అక్షర్, అర్ష్‌దీ?పల ధాటికి వేగంగా వికెట్లను కోల్పోవడం జట్టును దెబ్బతీసింది. చివర్లో సోధీ జోరుగా ఆడి ఓటమి అంతరాన్ని తగ్గించాడు.

### ఎదురుదాడే లక్ష్యంగా..:

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆకాశమే హద్దుగా సాగింది. సొంత మైదానంలోనూ ఓపెనర్ సంజూ శాంసన్ (6) పేలవ ఫామ్ కొనసాగినా.. మరో ఎండ్‌లో అభిషేక్, ఇషాన్, సూర్యకుమార్, హార్దిక్ ధనాధన్ ఆటతో బౌలర్లను ఆడేసుకున్నారు. పవర్‌ప్లేలోనే ఓపెనర్లు వెనుదిరగడంతో ఇషాన్-సూర్య జోడీ కాస్త నెమ్మదించింది. కానీ డ్రింక్స్ విరామం తర్వాత ఇషాన్ ధాటికి ఆట స్వరూపమే మారిపోయింది. ఫెర్గూసన్ ఓవర్‌లో 4,6తో బ్యాట్‌కు పనిచెప్పిన అతను 12వ ఓవర్‌లో 4,4,4,6,4, 6తో 29 రన్స్ రాబట్టాడు. అటు 14వ ఓవర్‌లో సూర్య 4,6,6,6తో 23 రన్స్ అందించడంతో పాటు 26 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశా డు. అయితే సూర్య వికెట్‌ను శాంట్నర్ తీయడంతో మూడో వికెట్‌కు అత్యధికంగా 137 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అయినా ఇషాన్ జోరు తగ్గలేదు. 2 వరుస సిక్సర్లతో 42 బంతుల్లోనే తొలి సెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే డఫీకి ఇషాన్ చిక్కగా.. డెత్‌ఓవర్లలో హార్దిక్ భారీ షాట్లతో విజృంభించాడు. ఆఖరి ఓవర్‌లో సిక్సర్ బాది హార్దిక్ వెనుదిరగగా, శివమ్ దూబే (7 నాటౌట్) మరో సిక్సర్‌తో భారత్‌కు 21 రన్స్ సమకూరాయి. అటు చివరి 10 ఓవర్లలో జట్టు 169 రన్స్ సాధించడం విశేషం.

### స్కోరుబోర్డు:

భారత్: అభిషేక్ (బి) ఫెర్గూసన్ 30, శాంసన్ (సి) జాకబ్స్ (బి) ఫెర్గూసన్ 6, ఇషాన్ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 103, సూర్యకుమార్ (స్టంప్) సీఫర్ట్ (బి) శాంట్నర్ 63, హార్దిక్ (సి) జాకబ్స్ (బి) డఫీ 42, రింకూ (నాటౌట్) 8, దూబే (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 271/5. వికెట్ల పతనం: 1-31, 2-48, 3-185, 4-233, 5-261. బౌలింగ్: డఫీ 4-0-53-1, జేమిసన్ 4-0-59-1, ఫెర్గూసన్ 4-0-41-2, సోధీ 3-0-48-0, ఫిలిప్స్ 1-0-10-0, శాంట్నర్ 4-0-60-1.

న్యూజిలాండ్: సీఫర్ట్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 5, ఆలెన్ (సి) రింకూ (బి) అక్షర్ 80, రచిన్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 30, ఫిలిప్స్ (సి) రింకూ (బి) అక్షర్ 7, మిచెల్ (బి) అర్ష్‌దీప్ 26, శాంట్నర్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 0, జాకబ్స్ (బి) వరుణ్ 7, జేమిసన్ (బి) అర్ష్‌దీప్ 9, సోధీ (సి) అర్ష్‌దీప్ (బి) రింకూ 33, ఫెర్గూసన్ (బి) అక్షర్ 3, డఫీ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 19.4 ఓవర్లలో 225 ఆలౌట్; వికెట్ల పతనం: 1-17, 2-117, 3-131, 4-137, 5-137, 6-166, 7-179, 8-180, 9-191, 10-225. బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-51-5, హార్దిక్ 2-0-15-0, బుమ్రా 4-0-58-0, వరుణ్ 4-0-36-1, అక్షర్ 4-0-33-3, అభిషేక్ 1-0-13-0, రింకూ 0.4-0-7-1.

## ఆ విషయంలో సూర్యకు క్రెడిట్ దక్కట్లేదు

**- ఇర్ఫాన్ పఠాన్**

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. దాదాపు ఏడాది కాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడ్డాడు. కెప్టెన్సీ విషయంలో అజేయంగా నిలుస్తున్నప్పటికీ.. సూర్య బ్యాట్ నుంచి పరుగులు రాకపోవడంతో అభిమానుల నుంచి క్రికెట్ మాజీల వరకు ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు న్యూజిలాండ్‌తో సిరీస్‌లో ఫామ్ అందుకుని అద్భుత ప్రదర్శనలు ఇస్తున్నాడు. టీ20 ప్రపంచ కప్ ముందు స్కై ఫామ్ అందుకోవడం కాస్త ఊరటనిచ్చే విషయమే. ఈ నేపథ్యంలో సూర్య కెప్టెన్సీపై టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫార్ పఠాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

'సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డ్ ఉంది. టీ20 ఫార్మాట్లో కెప్టెన్‌గా అతడికి విజయాల శాతం 84. ఇది చాలా ఎక్కువ. కానీ మనం సూర్యకుమార్‌కు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వడం లేదు. అలాగే సూర్య బౌలర్ల కెప్టెన్. అతడిలో రోహిత్ శర్మ ఛాయలున్నాయి. అతడు బౌలర్లపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తాడు. జట్టు కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటాడు.

'సూర్యకుమార్ యాదవ్ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. కెప్టెన్‌గా అతడు కచ్చితంగా ప్రపంచ కప్ ఆడతాడు. కానీ బ్యాటర్‌గా సూర్య పరుగులు రాబట్టాల్సి ఉంది. అది అతడికి ఎంతో కీలకం' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు. కెప్టెన్‌గా సూర్య రికార్డు అద్భుతంగా ఉన్నప్పటికీ.. బ్యాటర్‌గా ఫామ్ లేమితో ఇబ్బంది పడ్డాడు. ముఖ్యంగా 2025లో అతడు తన స్థాయికి తగ్గట్టు ప్రదర్శన చేయలేకపోయాడు. 21 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 218 పరుగులు మాత్రమే చేశాడు. అయితే టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు సూర్య తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో రెండు, మూడు టీ20ల్లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించిన విషయం తెలిసిందే.

## పాకిస్థాన్‌పై వైభవ్ బదులు తీర్చుకుంటాడా?

అండర్-19 వరల్డ్ కప్ 2026లో అసలైన సమరానికి సమయం ఆసన్నమైంది. ఫిబ్రవరి 1వ తేదీన క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే భారత్ వర్సెస్ పాకిస్థాన్ మహా సంగ్రామం జరగనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో అందరి కళ్లు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే ఉన్నాయి. ఐపీఎల్ వేలంలో రికార్డు ధర పలికి వార్తల్లో నిలిచిన వైభవ్, ఈ మ్యాచ్‌లో చెలరేగితే భారత్‌కు విజయం నల్లేరుపై నడకే. అయితే పాకిస్థాన్‌పై వైభవ్‌కు ఉన్న గత రికార్డులు మాత్రం అంత ఆశాజనకంగాలేవు. ఈ నేపథ్యంలో పాత లెక్కలు సరిచేయడానికి వైభవ్ సిద్ధమవుతున్నాడు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు పాకిస్థాన్‌పై మూడు అండర్-19 వన్డేలు ఆడాడు. అయితే ఈ మూడు మ్యాచ్‌ల్లో కలిపి అతను చేసిన పరుగులు కేవలం 32 మాత్రమే. సగటు కేవలం 10.66గా ఉంది. గత ఏడాది జరిగిన అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో భారత్ ఓడిపోయినప్పుడు, వైభవ్ చేసిన 26 పరుగులే పాకిస్థాన్‌పై అతని అత్యధిక స్కోరు. అంటే, ఒక స్టార్ బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న వైభవ్‌కు పాక్ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈసారి వరల్డ్ కప్ వేదికగా తనపై ఉన్న విమర్శలకు సమాధానం చెప్పడమే కాకుండా, తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరుచుకునేందుకు ఇది గొప్ప అవకాశం. పాకిస్థాన్‌ను ఓడించడం కేవలం ప్రతిష్టాత్మకమే కాదు, టెక్నికల్‌గా కూడా భారత్‌కు చాలా ముఖ్యం. రేపటి మ్యాచ్‌లో భారత్ గెలిస్తే, పాకిస్థాన్ టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించినట్టే. ఈ మ్యాచ్ గురించి వైభవ్ సహచర ఆటగాళ్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కెప్టెన్ ఆయుష్ మ్హాత్రే, విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుండు, దీపేష్ దేవేంద్రన్, హేనిల్ పటేల్ ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ ఆటగా



పరిగణిస్తూనే, తమ అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒత్తిడికి లోనుకాకుండా సహజ సిద్ధమైన ఆట ఆడటమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రను తిరగేస్తే భారత్, పాకిస్థాన్ జట్లు ఇప్పటివరకు 10 సార్లు తలపడ్డాయి. విశేషమేమిటంటే..రెండు జట్లు తలో 5 మ్యాచ్‌లు గెలిచి సమానంగా ఉన్నాయి. ఈ రికార్డును బట్టి చూస్తే రేపటి మ్యాచ్ ఎంత హోరాహోరీగా సాగనుందో అర్థం చేసుకోవచ్చు. భారత్ తన ఆరో విజయం కోసం చూస్తుంటే, పాక్ తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని తహతహలాడుతోంది. వైభవ్ సూర్యవంశీ క్రీజులో నిలబడితే పాక్ బౌలర్లకు కష్టాలు తప్పవు.

## టీ20 ప్రపంచ కప్ నుంచి పాట్ కమ్మిన్స్ ఔట్!

టీ20 ప్రపంచ కప్ 2026 కోసం ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించింది. బోర్డు మొదట ప్రాథమిక జట్టును ఎంపిక చేయగా ఇందులో




మాజీ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కూడా ఉన్నాడు, కానీ తాజాగా ప్రకటించిన జట్టులో అతడి పేరు లేదు. దాంతో కమిన్స్ టోర్నమెంట్ నుండి వైదొలిగాడు. కమ్మిన్స్ మాత్రమే కాదు, ఆస్ట్రేలియా ప్రాథమికంగా ప్రకటించిన జట్టులో తాజాగా 2 మార్పులు చేసింది. జనవరి 31న ప్రకటించిన జట్టులో మార్పులు చేయడానికి చివరి తేదీ అని తెలిపింది. భారత్, శ్రీలంకలో జరగనున్న టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి మరో వారం రోజులు మాత్రమే ఉన్నాయి. ఫిబ్రవరి 7వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్లో మొత్తం 20 జట్లు ఆడతాయి. వీటిని 5 జట్ల చొప్పున 4 గ్రూపులుగా విభజించారు. ఆస్ట్రేలియా గ్రూప్ దీలో ఉంది. ఈ గ్రూప్లోని అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలో జరుగుతాయి. ఆస్ట్రేలియాకు జట్టుకు ముందే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. పాట్ కమ్మిన్స్ వెన్నునొప్పి (లంబర్ స్ట్రెస్ ఇంజురీ) నుండి కోలుకుంటారని, టీ20 ప్రపంచ కప్లో ఆడతారని మేనేజ్‌మెంట్ భావించింది. ప్రారంభ జట్టులో అతడి పేరు ఉంది. కానీ ప్రధాన జట్టులో అతడి పేరు లేకుండా ప్రకటన చేశారు. పాట్ కమ్మిన్స్ మాత్రమే కాదు, తొలుత జట్టులో ఉన్న మాథ్యూ షార్ట్ కూడా ప్రధాన జట్టులో భాగం కాదు. వీళ్లిద్దరి స్థానంలో మాట్ రెన్షా, బెన్ డ్వార్షుయిస్లను ఆసీస్ జట్టులోకి తీసుకున్నారు. అనుభవజ్ఞుడైన ఆల్ రౌండర్ బౌలర్ కమ్మిన్స్ జట్టుకు దూరమవ్వడం జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే, కానీ మిచెల్ మార్ష్ కెప్టెన్సీలోని ఈ జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. ఇందులో ట్రావిస్ హెడ్, టిమ్ డేవిడ్, జోష్ ఇంగ్లిస్, కామెరాన్ గ్రీన్, జోష్ హేజిల్ వుడ్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్ వెల్ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నారు. వీరంతా టీ20 ఫార్మాట్లో సత్తా చాటిన క్రికెటర్లు.

### ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్లెట్, టిమ్ డేవిడ్, కూపర్ కనోలీ, బెన్ డ్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ హేజిల్ వుడ్, నాథన్ ఎల్లిస్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమన్, గ్లెన్ మాక్స్ వెల్, మార్కస్ స్టోయినిస్, మాథ్యూ రెన్షా, ఆడమ్ జంపా.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం



# నా రాజకీయ ప్రవేశ ప్రభావం పడుతుందనుకున్నా

## జన నాయగన్ విడుదలపై నటుడు విజయ్

విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రం వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దర్శక నిర్మాతలు దీనిపై స్పందించగా.. తాజాగా విజయ్ ఈ విషయంపై మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జన నాయగన్'కు ఇలా జరగడం చాలా బాధగా ఉందన్నారు. నా నిర్మాతల గురించి నాకు బాధగా ఉంది. నేను రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాకు ఇలా చేస్తున్నారు. నా కారణంగా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయరంగంలోకి రాకముందే వీటన్నిటికీ సిద్ధమయ్యాను. నా సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించాను' అని తెలిపారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా దీని విడుదల ఆలస్యం కావడంపై ఇటీవల బాధపడ్డారు. దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన విజయ్‌కు సినిమాల నుంచి మంచి వీడ్కోలు దక్కాలని ఆయన ఆకాంక్షించినట్లు చెప్పారు. కానీ, పరిస్థితి తమ చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సెన్సార్ సమస్య వల్ల ఈనెల 9న విడుదల కావాల్సిన 'జన నాయగన్' వాయిదా పడింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలిక స్టే విధించగా.. నిర్మాణసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌నే ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది.

ఈనెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.



# శ్రీవారిని దర్శించుకున్న అనిల్ రావిపూడి

## తదుపరి చిత్రం వివరాలు త్వరలోనే వెల్లడిస్తా..

టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం పట్ల కృతజ్ఞతగా స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడానికి ఆయన తిరుమల వచ్చారు.

శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన అనిల్ రావిపూడి తన తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన నెక్ట్స్ మూవీపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, మరో 10 నుంచి 15 రోజుల్లో అధికారికంగా అప్‌డేట్ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఫిల్మ్ నగర్ సమాచారం ప్రకారం, అనిల్ తన తదుపరి చిత్రాన్ని విక్టరీ వెంకటేష్‌తో చేసే అవకాశం ఉంది. ఇది ఒక భారీ మల్టీస్టారర్ అని, ఇందులో తమిళ స్టార్ కార్తీ లేదా మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నటించే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలే అందించిన అనిల్, ఈసారి పూర్తిగా కొత్త జానర్‌లో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ వేగంగా జరుగుతోంది.

# పల్లెటూరి అమ్మాయిగా ఫరియా అబ్దుల్లా

## భగవంతుడి మూవీలో డిఫరెంట్ రోల్



'జాతిరత్నాలు'తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి చిట్టి పాత్రే గుర్తొస్తుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఊహించినంత వేగంగా ముందుకెళ్లకపోయినా, ఫరియా మాత్రం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే వెండితెరపై బ్రేక్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె యాక్టివిటీ ఎప్పుడూ తగ్గలేదు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ఫ్యాన్స్‌కు దగ్గరగానే ఉంటూ తన పాపులారిటీని కంటిన్యూ చేస్తోంది.


ఇప్పటికే తిరువీర్ హీరోగా నటిస్తున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మళ్లీ చర్చలోకి వచ్చింది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర డిజైన్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఒకవైపు సంప్రదాయ పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లోనూ ఆమె కనిపించడం హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే, ఫరియాను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా చూపించారని చెప్పొచ్చు.కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. గ్లామర్‌ను మాత్రమే కాకుండా, ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం అన్నీ కలిపిన పాత్రగా ఇది కనిపిస్తోంది.

## అమ్మానాన్నల విడాకులు

# పాఠం నేర్పాయి

## నటి శృతిహాసన్ భావోద్వేగం

కమల్ హాసన్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శృతి హాసన్, ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే, వెండితెరపై ఆమె గ్లామర్ వెనుక ఎంతో కష్టం.. భావోద్వేగమైన గతం ఉందని ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో



బయటపెట్టారు. తన తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక విడిపోవడం తన జీవితాన్ని ఎలా మార్చేసిందో శృతి వివరించారు. తల్లిదండ్రుల విడాకుల తర్వాత తన జీవితం ఒక్కసారిగా తలకిందులైందని శృతి చెప్పారు. 'చెన్నైలో మెర్సిడెస్ బెంజ్ కార్లలో తిరిగిన నేను, అమ్మతో కలిసి ముంబై వచ్చాక లోకల్ ట్రైన్లలో ప్రయాణించాల్సి వచ్చింది. లగ్జరీ జీవితాన్ని, అలాగే కష్టాలను కూడా చూశాను' అని ఆమె తెలిపారు. అయితే, ఈ విడాకులు తనకు ఒక గొప్ప జీవిత పాఠాన్ని నేర్పాయని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒక స్త్రీ ఆర్థికంగా, మానసికంగా స్వతంత్రంగా ఉండటం ఎంత ముఖ్యమో తనకు అప్పుడే అర్థమైందని చెప్పుకొచ్చింది.. 'ఇద్దరు వ్యక్తులు కలిసి సంతోషంగా ఉండలేనప్పుడు, బలవంతంగా ఒకే ఇంట్లో ఉండి నరకం అనుభవించడం కంటే.. విడిపోయి విడిగా సంతోషంగా ఉండటమే మంచిది. అందుకే వారు విడిపోయినందుకు నేను ఒక రకంగా సంతోషించాను' అని శృతి హాసన్ కుండబద్దలు కొట్టారు. మొదట్లో 'ఐరన్ లెగ్' అని విమర్శలు ఎదుర్కొన్నా, తన కష్టంతో నేడు దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో ఒకరిగా నిలవడం విశేషం. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

# చిత్రపరిశ్రమలో సెక్స్ వేధింపులు

## తమ్మారెడ్డి వ్యాఖ్యలతో కుదుపు

చిత్రసీమలో మరోమారు క్యాసింగ్ కౌచ్ దుమారం రేపుతోంది. తాజగా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేసిన వ్యాఖ్యలు ఒక్కరిగా చిత్ర పరిశ్రమను కుదిపేశాయి. క్యాస్టింగ్ కౌచ్ లేదని చిరంజీవి అనగనే, గాయని చిన్మయి ఉందనేశారు. 'కాస్టింగ్ కౌచ్' లేదని మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో వేధింపులు లేవని కొట్టిపారేయలేమని ఆయన స్పష్టం చేశారు. అంతే కాదు ఒకప్పుడు జమీందారులు, రాజులు కేవలం అమ్మాయిలను అనుభవించడానికే సినిమాలు తీసేవారని, ఆ పరిస్థితి ఇప్పటికీ కొందరిలో కొనసాగుతోందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం ఏడాదికి 200 సినిమాలు వస్తున్నాయని, అందులో కొందరు ఎందుకు సినిమాలు తీస్తున్నారో వాళ్లకే తెలియదని.. కేవలం అమ్మాయిలను లోబర్చుకోవడానికే అలాంటి వారు



ఇండస్ట్రీలోకి వస్తుంటారని తమ్మారెడ్డి విమర్శించారు. అయితే, సీరియస్‌గా సినిమాలు తీసే పెద్ద దర్శకులు, నటులు వీటికి దూరంగా ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. గాయని చిన్మయి గురించి మాట్లాడుతూ.. ఆమె వేధింపులపై పోరాడితే నిషేధం విధించడం దారుణమని, ఆమెను చూసి మహిళలు స్ఫూర్తి పొందాలని సూచించారు. పరిశ్రమలో వేధింపులు ఉన్న మాట వాస్తవమే అని, కానీ టాలెంట్ ఉంటే ఎవరూ తొక్కలేరని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా సమస్య వస్తే తాము అండగా ఉంటామని, అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మరోమారు జంటగా శివాజీ, లయ

## నేరుగా ఓటిటిలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ చాలా కాలం తర్వాత జంటగా నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లకు రాకుండా నేరుగా డిజిటల్ వేదికగా విడుదలవుతోంది. అయితే ఈ సినిమా హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ దక్కించుకోగా తాజాగా స్ట్రీమింగ్ వివరాలను వెల్లడించింది. ఈ సినిమాను ఫిబ్రవరి 12 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది.ఒకప్పుడు వెండితెరపై సూపర్ హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ కాంబినేషన్ అనగానే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. 'స్వయంవరం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' వంటి చిత్రాల్లో వీరి కెమిస్ట్రీకి మంచి గుర్తింపు దక్కింది. ఇప్పుడు మళ్ళీ ఒక వెరైటీ టైటిల్‌తో, క్రైమ్ ఎలిమెంట్స్ కలిసిన కామెడీ ఎంటర్‌టైనర్‌తో వీరు రాబోతుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని పెంచాయి.




PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154